తెలంగాణ
# తెలుగు-వెలుగు
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రతిక్షణం ప్రజల పక్షం

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..
తెలంగాణ తెలుగు-వెలుగు తెలుగు జాతీయ దినపత్రిక
మీకో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 | 8096660656

సంపుటి : 02 సంచిక 328 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి గురువారం 15-5-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

# ఇంజనీర్ల పని.. నేతలు చేయొద్దు..
## అలా చేసిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు

- ప్రపంచంలో మూడేళ్లలో కూలింది ఇదొక్కటే
- రాజకీయ నాయకులు చెప్పినట్లు చేస్తే.. ఇంజనీర్లు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుంది
- ఉద్యోగ నియామకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం
- గ్రూప్-1పై రాజకీయ ప్రేరేపిత పిటిషన్
- త్వరలో గ్రూప్-1, 2, 3 నియామకాలు: సీఎం
- ఏఈ, జేటీవోలకు నియామక పత్రాలు




**హైదరాబాద్, మే 14:** ఇంజనీర్లు తమ పని తాము చేయాలని, ప్రాజెక్టులు కట్టాలనే విధాన నిర్ణయం మాత్రమే ప్రజాప్రతినిధులు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు చేయాల్సిన పనిని.. ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు చేయకూడదన్నారు. అలా చేయడం వల్ల వచ్చిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లు పెట్టిన ప్రాజెక్టులకు కనీసం భూభౌతిక పరీక్షలు కూడా చేయలేదని, పెద్దసారు హెలికాప్టర్‌లో పోతూ.. కిందికి చూసి, ఇక్కడొకటి, అక్కడొకటి కట్టమని చెబితే పేపర్‌లో రాసుకొని కాంట్రాక్టర్‌కు ఇచ్చి కట్టించారని ఆరోపించారు. బుధవారం.. కొత్తగా ఎంపికైన 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు, 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారుల (జేటీవోల)కు జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శ్రీశైలం, శ్రీరాంసాగర్‌లు సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే కట్టారు. ఎన్ని ఉపద్రవాలు, వరదలు వచ్చినా ఆ ప్రాజెక్టులు నిటారుగా నిలబడ్డాయి. 22 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన సాగర్‌కుగానీ, 2009లో సామర్థ్యానికి మించి వరదలు వచ్చినా శ్రీశైలం ప్రాజెక్టుకుగానీ ఏమీ కాలేదు. చెక్కు చెదరకుండా నిలబడ్డాయి. సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్‌ల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. కానీ, కాళేశ్వరంపై సీఎంగా బాధ్యతలు చేపట్టేనాటికి రూ.1.02 లక్షల కోట్లు బిల్లులు చెల్లించగా.. మరో రూ.10 వేల కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా.. 50 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. రూ.1.02 లక్షల కోట్లతో నిర్మించి.. మూడేళ్లలోపే కుప్పకూలిన ప్రాజెక్టు భూప్రపంచంలోనే లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు సాగర్, శ్రీశైలం, ఉస్మాన్‌సాగర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎలా కట్టకూడదో అనేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఉదాహరణ అని పేర్కొన్నారు.

**భావోద్వేగంతో నడిపించారు..**

నీళ్లు, నిధులు, నియామకాలను భావోద్వేగంగా మార్చి.. రాజకీయం చేసి, రెండుసార్లు ప్రభుత్వాన్ని నడిపించారని బీఆర్ఎసనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేవలం సాగునీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చుపెట్టారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వాయిదా పడుతూ, నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి కాలేదంటే.. దీనికి కారణాలేంటో శాఖలో చేరే ఇంజనీర్లు ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన పదేళ్లలో ఏ ప్రాజెక్టూ పూర్తికాలేదని, కానీ.. రూ.2 లక్షల కోట్లు ఖర్చయ్యాయని విమర్శించారు. నిధులు వరదలా పారాయని, అవి ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ఆలోచన చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖను కేటాయించామని, అందుకే ఈ శాఖలో నియామకాల వి షయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు.

## మోదీ అధ్యక్షతన సీసీఎస్ భేటీ



**న్యూఢిల్లీ, మే 14:** ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత సీసీఎస్ భేటీ కావడం ఇదే తొలిసారి. తాజా భద్రతా పరిస్థితులు, దేశ సన్నద్ధతపై సమావేశంలో చర్చించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కాగా, మహా దళపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఆపరేషన్ సింధూర్ గురించి వివరించారు. మరోవైపు, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భద్రతను కేంద్రం మరింత పెంచింది. ఇటీవల జరిపిన సమీక్షలో భాగంగా ఆయనకు ప్రస్తుతం కల్పిస్తున్న జెడ్ కేటగిరీ సెక్యూరిటీలో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేర్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా?
### ఈ చర్యలపై రాహుల్ సమాధానం చెప్పాలి: కేటీఆర్



**హైదరాబాద్, మే 14:** అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా? ఇదేనా ప్రజాపాలన అంటూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అందాల పోటీలో పాల్గొనేవారి పర్యటన కోసం వరంగల్‌లో దారివెంట ఇళ్ల ధ్వంసం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనా విధానంపై, అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్లకింద నలిగిపోవాలా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా, ప్రపంచసుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చినవారి కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం అభ్యంతరకరమని.. ఇది మొత్తం తెలంగాణ సమాజాన్ని అవమానించినట్లేనని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు.

## టీపీసీసీకి మూడ్రోజుల్లో కొత్త కార్యవర్గం!



**న్యూఢిల్లీ, మే 14:** టీపీసీసీ కొత్త కార్యవర్గ నియామకం ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు రోజుల్లో నూతన కమిటీని ప్రకటించే అవకాశముంది. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. కేసీ నివాసంలో సుమారు గంటసేపు జరిగిన సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు.

## కర్రెగుట్టల్లో 31 మంది మావోయిస్టులు హతం

ఇప్పటి వరకు 28 మందిని గుర్తించాం..

కొందరు అగ్రనేతలూ హతమై ఉంటారు!

నక్సల్స్‌కు లొంగిపోవడం తప్ప దారి లేదు

సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి.సింగ్,ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ వెల్లడి

శాంతిని నెలకొల్పుతాం: ప్రధాని

మార్చి 31 కల్లా నక్సల్స్ రహిత భారత్: షా




**చర్ల, మే 14:** ఛత్తీస్‌గఢ్ -తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టు సమస్య అంతానికి ఇది ఆరంభమన్నారు. బీజాపూర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ డీజీ గ్యానేంద్ర ప్రతాప్ (జీపీ)సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్.. కర్రెగుట్టల ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. మావోయిస్టులకు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదని స్పష్టం చేశారు. కర్రెగుట్టలపై మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో ఏప్రిల్ 21న ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో బలగాలు కూంబింగ్ చేశాయని, ఆపరేషన్ సాగిన 21రోజుల్లో 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. అడవుల్లో 450 బీర్ బాంబులు, ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మొత్తం 31 మంది మావోయిస్టులు చనిపోయారని, ఇప్పటివరకు 28మందిని గుర్తించామని, ఏడుగురి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని వివరించారు. వీరందరిపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందన్నారు. బలగాల దాడిలో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారని, సెర్చ్ ఆపరేషన్‌లో మృతదేహాలు దొరుకుతున్నాయని తెలిపారు. మృతుల్లో చాలా మంది కీలక నేతలూ ఉంటారని పేర్కొన్నారు. గుట్టల్లో 214మావోయిస్టు డంపులు గుర్తించామని, 4 ఆయుధ తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేశామన్నారు. చనిపోయిన మావోయిస్టుల నుంచి అధునాతన మెషిన్‌గన్స్, ఏకే 47, ఇన్సాస్ తుపాకులు లభించాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో 18 మంది జవాన్లు గాయపడ్డారన్నారు. ఆపరేషన్ కగార్ భవిష్యత్తులోనూ కొనసాగుతుందని తెలిపారు.

## సీజేఐ జస్టిస్ గవాయ్
### ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు - తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా రికార్డు
- 1985లో న్యాయవాదిగా కెరీర్ ఆరంభం - 2003లో హైకోర్టు.. 2019లో సుప్రీం జడ్జిగా..
- ఆర్టికల్ 370 రద్దు, బుల్డోజర్ న్యాయం - తదితర కీలక తీర్పుల్లో భాగస్వామ్యం



**న్యూఢిల్లీ, మే 14:** జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్ చేత ఈ మేరకు ప్రమాణం చేయించారు. ప్రమాణం అనంతరం జస్టిస్ గవాయ్ తన తల్లి కమల్‌తాయి గవాయ్‌కి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, జేపీ నడ్డా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. 64 ఏళ్ల వయసున్న జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబరు 23 వరకూ సీజేఐ పదవిలో కొనసాగనున్నారు. కాగా, జస్టిస్ గవాయ్ బౌద్ధమతావలంబకులు. తద్వారా దేశ తొలి బౌద్ధ సీజేఐగా నిలిచారు. అంతేకాదు జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత సీజేఐ పదవిని చేపట్టిన రెండో దళితవ్యక్తిగా పేరొందారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ సీనియర్ రాజకీయ నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్) పార్టీని స్థాపించి దళిత వర్గాల నేతగా పేరొందారు. 1985లో భూషణ్ రామకృష్ణ గవాయ్ న్యాయవాదిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1992-93లో బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 2000లో ప్రభుత్వ ప్లీడర్‌గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019 మే24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపొందారు. సీజేఐగా మం గళవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా అదే ఏడాది అదేరోజు సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ గత ఆరేళ్లలో దాదా పు 700 ధర్మాసనాల్లో ఉన్నారు. దాదాపు 300 తీర్పులను స్వయంగా రాశారు. పలు కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామి. వాటిలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయటానికి సమర్థన, పెద్దనోట్ల రద్దు సబబేనని తీర్పు, ఎన్నికల బాండ్లరద్దు, బుల్డోజర్లతో ప్రభుత్వమే నిందితుల ఇళ్ల ను కూల్చటాన్ని నిలిపివేస్తూ తీర్పు.. ఉన్నాయి. ఇటీ వల అలహాబాద్ హైకోర్టు జడ్జి ఒకరు.. నిందితుడు ఓ మహిళ పైజామా తాడు లాగటం, ఛాతిని తాకటం రేప్ కిందకు రాదంటూ ఇచ్చిన తీర్పును జస్టిస్ గవాయ్ సారథ్యంలోని బెంచ్ నిలిపేసింది. సీజేఐగా ప్రమాణం అనంతరం సుప్రీంకోర్టులో తనను న్యాయవాదులు కలిసిన సందర్భంగా జస్టిస్ గవాయ్.. 'జై భీం' అంటూ వారిని పలకరించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తితో 'జై భీం' నినాదం రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. కాగా, సీజేఐగా ప్రమాణం చేయటానికి కొన్ని రోజుల ముందు తన నివాసంలో జస్టిస్ గవాయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. సీజేఐగా తనకు రాజ్యాంగమే అత్యున్నత ప్రమాణంగా ఉంటుందని స్పష్టం చేశారు. పదవీ విరమణ తర్వాత ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టబోనని చెప్పారు. తాజాగా, రిటైర్డ్ అయిన సీజేఐ సంజీవ్‌ఖన్నా కూడా ఏ పదవీ చేపట్టనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

ఆయుధాలు వీడటంపై ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోలేం

మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్



**హైదరాబాద్, మే14**

ఆపరేషన్ కగార్ పేరిట దారుణ మారణకాండ కొనసాగుతోందని, దీనికి అడ్డుకట్ట వేస్తూ శాంతిచర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఓ లేఖలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ కోరారు. శాంతిచర్చలకు అనుకూల వాతావరణంలో భాగంగా తాము షరతుల్లేని కాల్పుల విరమణకు సన్నద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రకటన జారీ చేశామని గుర్తు చేశారు. శాంతిచర్చల విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, బీఆర్ఎస్ నేత కేసీఆర్ బహిరంగసభలో శాంతిచర్చలు కావాలన్న డిమాండ్‌కు లక్షలాది ప్రజలు ఇచ్చిన స్పందన కేంద్రం గమనించాలని కోరారు. తమ పార్టీ నిర్మాణం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉంటుందని ఆయుధాల వీడటంపై తానొడినే నిర్ణయం తీసుకోలేనని, కేంద్రకమిటీ, కోర్ కమిటీ సమావేశమై చర్చ తర్వాత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వాస్తవ పరిస్థితులు అందుకు అనుగణంగా లేవని కేంద్ర, కోర్ కమిటీసభ్యులు కలవడానికి వీలుగా కాల్పుల విర మణ, శాంతిచర్చల ప్రక్రియ కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

**- తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరి లింగంపల్లి - మే 20న దేశవ్యాప్త సమ్మెలో**

**బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి**

**- బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ - రాష్ట్ర సదస్సు పిలుపు**





మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్ బాగ్ లింగంపల్లి,ఓంకార్ భవనం హైదరాబాద్ లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బిఎల్ టీప్రధానయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ సిద్ది రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎ.ఐ.సి.టి.యు రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతు భారత బహుజన కార్మిక వర్గానికి రాజ్యాంగం కల్పించిన 44 రక్షణ చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక యాజమాన్య అనుకూల నాలుగు కోడ్ ల ను తెచ్చిన బిజెపి కేంద్ర ప్రభుత్వం అంబానీ, ఆదాని లాంటి స్వదేశీ, విదేశీ కార్పోరేట్ కంపెనీలకు లాభాల కోసం తెచ్చిన కార్మిక వ్యతిరేక 4 కోడ్ లను రద్దు చేయాలని,పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని కనీస వేతనాలు మరియుఉద్యోగ భద్రత కనీస కార్మిక చట్టాలు అమలు తదితర డిమాండ్స్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భారత బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోని ఔట్ సోర్సింగ్,కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆలోపు సుప్రీంకోర్టు తీర్పుననుసరించి కనీస వేతనం రూ 26 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసిటియు రాష్ట్ర నాయకులు కర్ర దానయ్య ,జి.శివాని, బి.ఎల్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, కె.హెచ్.పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ ప్రసాద్,టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు డి.రాజేష్,ఎఐఎఫ్ టియు ,రాష్ట్ర, నాయకులు, మల్లేష్, రాష్ట్ర,నాయకులు,యకయ్య,టీ,ఎఫ్ ,టీయూ,రాష్ట్ర,ప్రదాన కార్యదర్శి,యస్, ఖాలీల్,రాష్ట్ర సుపాద్యక్షులు,యదగిరి, టీ,యస్,కే,పి,యస్, రాష్ట్ర అధ్యక్షులు, మైలరం,జంగయ్య, రాష్ట్ర నాయకులు, గ్యార సాలయ్య, యస్,ప్రభాకర్,కే,హెచ్,పి,యస్,రాష్ట్ర,నాయకులు, యం,వెంక టయ్య, టీ,వి,వి,యు,తెలంగాణ వ్యవసాయ వృతి దారుల సంఘం,రాష్ట్ర, అధ్యక్షులు, డోలక్,యాదగిరి,పి,వి,కే,వి,రాష్ట్ర నాయకులు, శేక్ శావాలి,ఐ,ఎఫ్, టీయూ, జాతీయ నాయకులు, సునీత,ప్రగతీ శీల మహిళల సంఘం,రాష్ట్ర నాయకు రాలు,మేకల రాజేందర్,గంగా శంకర్,బహుజన మున్సిపల్ యూనియన్, రాష్ట్ర నాయకులు, బి,జగదీష్, యస్, డి,సైయ్యద్,తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక రాష్ట్ర నాయకులు, కళాకారులు పాటల ద్వారా ఉత్తేజం ఇంపారు, లు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర రక్షణ చట్టాలను చేయాలని డిమాండ్ చేయాలని,బిజెపి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ,30, 000,అమలు చేయాలని.ఇ,పి,ఎప్,పెన్షన్,15000/-ఇవ్వాలని, బీడీ పరిశ్రమ పై కేంద్ర ప్రభుత్వం విధించినా,ఆంక్షలు ,జి,యస్, టీ,కోప్టా చట్టం ను రద్దు చేయాలని, ప్రభుత్వ శాలల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులను పరిమినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

# అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

## షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

**190 మంది లబ్ది దారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ**

**రూ.1 కోటి 90 లక్షల 22వేల 40 రూపాయల విలువైన చెక్కుల పంపిణీ**

**పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని వెల్లడి..**





అత్యంత పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం ఫరూఖ్ నగర్ మండలం వివిధ గ్రామాలకు చెందిన షాద్ నగర్ మున్సిపాలిటీ చెందిన 190 మంది లబ్ది దారులకు 1 కోటి 90 లక్షల 22వేల 40 రూపాయల కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్ని నిధులైన ప్రభుత్వం ఖర్చు చేయడానికి వెనుకాడ బోదని అన్నారు. ఉచిత కరెంటు ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు సిలిండర్ సన్న బియ్యం పంపిణీ తదితర మహత్తర కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆయన అన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ నిధులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని వివాహ ఖర్చులు కలిసి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే శంకర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఫరూఖ్ నగర్ తహశీల్దార్ పార్ట సారది, డిప్యూటీ తహశీల్దార్ ఆనంద్ సింగ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్,మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, నేతలు అగ్గనూర్ బస్వ%శీ%, చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, బాలరాజు గౌడ్, శ్రీనివాస్, కొప్పునూరి ప్రవీణ్, రాజు, శ్రీశైలం, సుదర్శన్, అశోక్, సురేష్ గౌడ్, దిలీప్, గంగమోని సత్తయ్య, యాదయ్య,లింగారెడ్డి గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అందరూ ధర్మాన్ని పాటించాలి

**- షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**

**- నేను అని విర్రవీగితే శూన్యమే - ఎలికట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమం**



ధర్మాన్ని పాటించడం అంటే సమతను కాపాడటమని, ప్రకృతి సమతుల్యంగా ఉండాలనీ అది ప్రకృతి ధర్మం అని ఆ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఒకే మాట ఒకే బాణం అని నిర్దేశించిన ఆ శ్రీరామచంద్రమూర్తి భక్తుడు ఆంజనేయస్వామి మనకు ఆదర్శమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరుక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి పున ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామికి పెద్ద ఎత్తున పూజారి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పెద్దలు సమక్షంలో ఎమ్మెల్యే శంకర్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. మనం చేసే పనులు కూడా ప్రకృతి ధర్మాన్ని కాపాడేలా ఉండాలి, కానీ దాన్ని విచ్ఛిన్నం చేయకూడదనీ ఆయన అన్నారు. నేను అని విర్రవీగినవాడు ఈ సృష్టిలో లేడని అన్నారు. భక్తులు ఆలయాలు కట్టడం పెద్ద గొప్ప విషయం కాదని కానీ ధర్మాన్ని పాటించడం గొప్ప విషయం అని అన్నారు. మనలో ధర్మం నశించినప్పుడు మానవత్వం లేనప్పుడు మనలో మార్పు రానంతవరకు ప్రయోజనం ఉండదని హితోపదేశం చేశారు. శ్రీరామచంద్రమూర్తి ఒకే మాట ఒకే బాణంతో నియమనిష్టలతో రాజ్యాన్ని పరిపాలించారని ఆయనకు భక్తుడైన ఆంజనేయస్వామి ధర్మ పరిరక్షణ కోసం పాటుపడ్డారని వారే మనకు ఆదర్శమని అన్నారు. మనం చేసే ప్రతి పనిని భగవంతుడు నిషిత దృష్టితో గమనిస్తుంటాడని చూడలేదు అని ఎన్నడూ అనుకోవద్దని అన్నారు. అందుకే నిర్మలమైన మనసుతో నిర్మలంగా జీవించాలని ఇచ్చిన మాటకు కట్టుబడి దాన్ని తప్పకుండా చూడాల్సిన బాధ్యత కర్తవ్యం అందరిపై ఉందన్నారు. ఎలుకటరు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో ఆధ్యాత్మిక వైభవాన్ని తీర్చిదిద్దుతున్న కమిటీ సభ్యులకు గ్రామ పెద్దలకు ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు..

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

**షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షం**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. బుధవారం సాయంత్రం కురిసిన గాలి వానలతో మార్కెట్ యార్డులో భిన్న పరిస్థితి నెలకొంది. ఈ వర్షానికి మార్కెట్ యార్డులో నిలువ ఉంచిన రైతుల ధాన్యంతో పాటు ట్రేడర్లు కొన్న ధాన్యం కూడా తడిసినట్లు బాధితులు తెలిపారు.

## ఎల్లికట్ట గ్రామంలో ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట మహెూత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్**





ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. గణపతి, శ్రీరామచంద్రమూర్తి, శ్రీ ఆంజనేయస్వామి, కాశీ విశ్వేశ్వర నందీశ్వర, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్ విగ్రహ ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ, తమ ఇష్ట దైవాన్ని పూజిస్తే మనశ్శాంతి కలుగుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామంలో దేవత మూర్తుల విగ్రహ ప్రతిష్ట మహెూత్సవాని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బెంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ వైస్ చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్, నాయకులు వీరేశం గుప్తా, బచ్చలి నరసింహా, యాదయ్య, సంజీవయ్య, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, రామస్వామి తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 18 మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంఈఎఫ్

**షాద్ నగర్ నూతన కమిటి ప్రకటిస్తాం**

**ఎంఈఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కంటి మల్లేశ్ మాదిగ**



ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) సీనియర్ నాయకులు బేరి లింగం, యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు కుంటి మల్లేష్ మాదే, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదయ్య మాదిగ హాజరై మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయడం కోసం రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎంఈఎఫ్ నూతన కమిటీలో వేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈ ఆదివారం షాద్ నగర్ నియోజకవర్గం కమిటీ వేయడం జరుగుతుందనీ అన్ని డిపార్ట్మెంట్లో పని చేస్తున్నటువంటి మాదిగ ఎంప్లాయిస్ నాయకులు కచ్చితంగా పాల్గొని కమిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్), షాద్ నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గా బేరిలింగం మాదిగ (ఉపాధ్యాయులు)ని ఎన్నుకోవడం జరిగిందనీ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంట నోళ్ళ నరసింహ మాదిగ , కల్లేపల్లి బాలరాజు మాదిగ, గుడెపు ప్రవీణ్ మాదిగ, చెదురువల్లి లింగం మాదిగ ఉదయ్ కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాపాయ స్థితిలో కూడా కక్కుర్తి పడతారా..?

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" ఆగ్రహం**

**108 సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే అసహనం**

**పేషెంట్లను ప్రైవేటు ఆసుపత్రిలకు తరలిస్తున్న ఆరోపణలపై వార్నింగ్**

**ప్రమాద పరిస్థితులలో పేషెంట్లను ప్రైవేటుకు తరలిస్తే కఠిన చర్యలు**

**షాద్ నగర్ ఏరియా 108 సిబ్బందితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష**

**హాజరైన డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి**



ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేషంట్లను 108 అంబులెన్స్ లో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు అన్న సిబ్బంది వ్యవహారంపై షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ తదితర 108 సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ 108 సిబ్బంది పై వస్తున్న ఆరోపణల విషయం గురించి కీలకంగా ప్రస్తావించారు. రోడ్డు ప్రమాదాలు తదితర విషయాలలో 108 సిబ్బంది పేషెంట్లను తమకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి వారి వద్ద నుండి సొమ్ము చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఈ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి 188 సిబ్బంది కొంతమంది పేషెంట్లను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకుండా ప్రైవేటుకు తరలిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని దీనిని మార్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. ఎంతో వ్యయ ప్రయాసలకు గూర్చి ప్రభుత్వం అనేక నిధులు కేటాయించి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు నాణ్యంగా అందిస్తుంటే సంకట పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పేషంట్లను 108 సిబ్బందికి అనుకూలంగా ఉన్న ఆర్థికంగా ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులకు వారిని తీసుకువెళ్లి అప్పజెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. ఒక్కో పేషెంట్ వద్ద 4000 రూపాయలు లభిస్తున్నాయని ఇది తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే ఘాటుగా అల్టిమేట్ జారీ చేశారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమాజంలో అందరూ కట్టుకుపోయేది ఏమీ లేదని, సాటి మనిషిని వైద్యం పేరిట దోచుకోవడం తెలివిగా దాచుకోవడం సరికాదని బోధించారు. మీరు ముమ్మాటికి తప్పు చేస్తున్నారు అలాంటి తప్పులు చేయకండి అంటూ హెచ్చరించారు. ఇలాంటివి తన దృష్టికి మళ్ళీ రాకూడదని హెచ్చరించారు. రాబందుల ప్రజలను పట్టి పీడించుకు తింటున్నారని ఓవైపు ప్రైవేటు ఆసుపత్రులు మరోవైపు 108 సిబ్బంది తీరు పట్ల ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితిలో పేషెంట్లను ఎక్కడికి తీసుకు వెళ్లాలో మీకు తెలియదా కానీ తెలిసి తప్పులు చేస్తున్నారు అలాంటి తప్పులు చేయకండి. మీకేమైనా సమస్యలు ఉంటే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లేదా ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు.

**పేషెంట్లను రెఫర్ చేస్తున్నారు..**

ప్రతి చిన్న దానికి చీటికిమాటికి ఉస్మానియాకు వైద్యులు రెఫర్ చేస్తున్నారని మందులు బయటికి రాస్తున్నారని దీనివల్ల పేషెంట్లు అసహనంతో తమను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని గోల చేస్తున్నారని అందుకే తాము ఇలా చేయాల్సి వస్తుంది అంటూ 108 సిబ్బంది తమ మనసులోని మాటను ఎమ్మెల్యే ముందు బాహాటంగా చెప్పారు. ఇది విన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అక్కడే ఉన్న డాక్టర్ విజయలక్ష్మికి ఈ విషయం ఏమిటో చూడాలని పేదలకు వైద్యం ఇక్కడే అందేటట్లు చూడాలని సాధ్యమైనంతవరకు ఇక్కడే వైద్యం అందించాలని అనవసరంగా ఉస్మానియాకు రెఫర్ చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురి అయ్యే అవకాశం ఉందని ఇలాంటి వాటికి పరిష్కార మార్గం చూడాలని అయినదానికి కాని దానికి చిన్న పనికి రెఫర్ చేయడం సరికాదని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

# ఘనంగా దోమడుగులో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ పవిత్ర కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది. గ్రామ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో శాంతి, సామరస్య వాతావరణాన్ని పెంపొందిస్తాయి" అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందించనున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, వేణు, మాజీ ఎంపిటీసీ గోవర్ధన్ గౌడ్, దేవేందర్ రెడ్డి, సదానంద రెడ్డి, రాజిరెడ్డి, లింగం, అంజిరెడ్డి, బాల్ రెడ్డి, కడాలిమురళి, మంగయ్య, వెంకటేష్, వీరారెడ్డి, స్వేచ్చా రెడ్డి, మల్లారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.

## ఆర్ కృష్ణయ్య ఎంపీ రాజ్యసభ సభ్యుల ఆధ్వర్యంలో

# కోంటు సుమన్ జన్మదిన వేడుకలు





ఆర్ కృష్ణయ్య ఎంపీ రాజ్యసభ సభ్యుల ఆధ్వర్యంలో బిసి యువజన నాయకుడు ఐక్యవేదిక యూత్ అధ్యక్షులు కోంటు సుమన్ జన్మదిన వేడుకలో పాల్గొన్న బీసీ తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. విద్యానగర్ బిసి భవన్ లో ఆర్ కృష్ణయ్య మరియు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సుమన్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవడం సంతోషదాయకం. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ సుమన్ను జన్మదిన శుభాకాంక్షలు తెలపడం విశేషం. ఆర్ కృష్ణన్న శాలువాతో సత్కరించి ఆశీర్వదిస్తూ పది కాలాలపాటు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సమాజంలో మంచి పేరు తెచ్చుకొని వర్ధిల్లాలని ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంలో బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ అన్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కొంటూ ముకుందం గారి సుపుత్రం శ్రీ సుమన్ కొంటూ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకం అందులో రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులైన ఆర్.కృష్ణయ్య ద్వారా ఆశీర్వాదాలు పొందడం గొప్పగా భావిస్తూ ప్రసంగించడం జరిగింది

సుమన్ ఆయురారోగ్యాలతో నూరేళ్లు చల్లగా బ్రతకాలని సమాజం కోసం పనిచేయాలని ముఖ్యంగా బీసీలకు నాన్నగారితోపాటు సేవ చేయాలని సామాజిక న్యాయం కోసం పేద ప్రజలకు అందుబాటులో అండగా ఉంటూ తన ధర్మంని నిర్వర్తించాలని సహాయపడాలని బేరి రామచంద్ర యాదవ్ కోరడం జరిగింది బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూతన సందేశంలో సుమన్ గారు యువజన సంఘం అధ్యక్షులు యువతను ప్రోత్సహిస్తూ తన యొక్క ఉనికిని చాటుకుంటూ సమాజ సేవ ముఖ్యంగా పేదలకు సేవ చేయాలని కోరడం జరిగింది సుమన్ గారు ఆయురారోగ్యాలతో సంతోషంగా నూరేళ్లపాటు జీవించాలని ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణమోహన్ ఆర్కే సాయన్న తెలంగాణ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, సిద్ధార్థ ముదిరాజ్ శ్రీనివాస్ పటేల్ అభిమానులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ ఆరు రాష్ట్రాల కాంగ్రెస్ ఇంచార్జ్ అంబర్పేట్ ఆఫీసులో సుమన్ గారి పేరుతో కేక్ కట్ చేయడం జరిగింది హాజరైన బేరీ రామచంద్ర యాదవ్, శ్రీకృష్ణమోహన్, ఆర్కే సాయన్న ముదిరాజ్, సిద్ధార్థ ముదిరాజ్, శీను పటేల్ అందరికీ శాలువాలతో సత్కరించడం జరిగింది సుమన్ గారికి సన్మానం చేసి కేక్ కట్ చేసి నూరేళ్లపాటు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించడం జరిగింది అంబర్పేట్ శ్రీనన్న ఆశీర్వదించిన తర్వాత సుమన్ గారు సంతోషంగా తన జన్మదినాన్ని పురస్కరించుకొని అందరికీ ధన్యవాదాలు తెలుపడం జరిగింది. మాజీ మంత్రివర్యులు కృష్ణ యాదవ్ గారు తన అంబర్పేట్ కార్యాలయంలో శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది ముఖ్యంగా కృష్ణ యాదవ్ గారు సుమన్ గారి ఉద్దేశించి ఆయురారోగ్యాలతో అమ్మ నాన్నలకు సేవ చేస్తూ పేదలకు సమాజంలో సహాయపడుతూ మంచి పేరు తెచ్చుకొని జీవించాలని ఆశీర్వదించారు. హైదరాబాదు నుండి కాంటెస్ట్ పార్లమెంట్ సభ్యులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ గారు తన బర్కత్పూర తన ఆఫీసులో సుమన్ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ముఖ్యంగా శ్రీనివాస్ యాదవ్ గారు కొంటూ సుమన్ను ఆశీర్వదిస్తూ నూరేళ్ల పాటు ఆయురారోగ్యాలతో చల్లగా బ్రతకాలని భగవంతుని ప్రార్థించడం జరిగింది.

## దేవాలయాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వైభవం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



దేవాలయాలను గ్రామాల్లో నిర్మించడం ద్వారా ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరుస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామీ, విగ్నేశ్వర స్వామీ, కాశీ విశ్వేశ్వర నవగ్రహ పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా.. ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో చదివే పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి

**ప్రభుత్వం జూనియర్ కళాశాల నిర్మాణానికి 11 లక్షలు విరాళం**

**విరాళం అందించిన బింజుసారియా ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం**



షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కొత్తూరు మండలంలోని తీగాపూర్ గ్రామంలో ఉన్న బింజుసారియా ఇస్పత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాని వినోద్ కుమార్ జి కేడియా తన తండ్రిగారైన భన్వరీ లాల్ జి జ్ఞాపకార్థం 11.0 లక్షల రూపాయల విరాళాన్ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాని వినోద్‌కుమార్‌జి కేడియా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చవివే పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలానే ఉద్దేశ్యంతో కళాశాల నిర్మించడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోముల బసప్ప, హితేష్ కేడియా పాల్గొన్నారు.

## వీరసముద్రం, లచ్చంపేట గ్రామాలలో బీసీ సేన గ్రామ కమిటీలు

**అధ్యక్షులుగా జానంపేట యాదమ్మకు నియామక పత్రాన్ని అందజేసిన జయ**



రంగారెడ్డి జిల్లా చౌదరీగూడా మండలం వీరసముద్రం గ్రామంలో జాతీయ బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ కమిటీ ఎన్నికకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ పాల్గొన్నారు. బీసీసేన కమిటీ మహిళా అధ్యక్షురాలుగా జానంపేట యాదమ్మ ఉపాధ్యక్షురాలుగా పర్వతాపురం యాదమ్మ ప్రధాన కార్యదర్శిగా జె కవిత కార్యదర్శిగా టి యాదమ్మ ను కోశాధికారిగా జె మంజుల ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప నియోజకవర్గ యువజన అధ్యక్షులు పాలాది శ్రీను ఫరుక్ నగర్ మండల అధ్యక్షులు మేకల వెంకటేష్ చెన్న బాలరాజ్ జి శ్రీనివాస్ మరియు గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లచ్చంపేట్ లో మహిళా అధ్యక్షురాలు బోయ వెంకటమ్మ ఉపాధ్యక్షులు బిపాషా కార్యదర్శి కమ్మర్ పేట్ల మనీలా కోశాధికారి కావలి వీరమని ని ఎన్నుకోవడం జరిగింది కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి జూపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ నాయకుల అలసత్వం వల్లనే బీసీలు వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి, విగ్నేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర నవగ్రహ ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలనికి హాజరై దేవాలయ%శీ%లో ప్రత్యేక పూజలు నిర్వహించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ నారం దినేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం అంబా భవాని దేవాలయ కమిటీ చైర్మన్ ముత్యాల రాజు, రాజు,శ్రీపద్ రెడ్డి,,వెంకటేష్, వెంకట్ రెడ్డి,కృపద్ రెడ్డి, బుడ్డ నరసింహ,చంద్రయ్య, రాములు, శివ గౌడ్,యాదయ్య, కార్తిక్ గ్రామస్తులు పాల్గొన్నారు.. %ఖూ



# హక్కులకై పోరాడుదాం కార్మిక చట్టాలను సాధించుకుందాం

**బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య**

ఈనెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి కార్మికులకు ఖర్చులకు పిలుపునిచిన బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీస్ జిల్లేడు చౌదరిగుడా ఎంపీడీవో గారికి ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మికుల హక్కులను కాల రాస్తుంది కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం అని ఆయన విమర్శించారు 100 ఏళ్లుగా ఉన్న చట్టాలు బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు కోడ్లుగా విభజించడం అంటే కార్మికుల హక్కులను హరిస్తూ కార్పోరేట్ శక్తులకు ఈడియం చేయడమేనని దుయ్యబట్టారు ఇప్పటికే యజమాన్యాలు కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నాయని దోసుకున్న సొమ్మును సిస్ బ్యాంకులో దాచుకుంటుంటే కేంద్ర ప్రభుత్వం అలాంటి శక్తులకు రక్షిస్తుందని ఇదే కడి న్యాయమని అన్నారు చిత్తశుద్ధిలేని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు కర్షకులకు నేటికీ భారతదేశంలో కనీస సౌకర్యాలు లేని పరిస్థితి ఉందని దానిపై దృష్టి పెట్టకుండా బీదలకు అనుకూలంగా ఉన్న చట్టాల జోలికి రావడం అంటే కొర్మితో గోక్కోవడమేనని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు ఇప్పటికే గ్రామ పంచాయతీ వర్కర్లకు మూడు నాలుగు నెలల నుంచి వేతనాలు లేవు పిఎఫ్ లేదు ఈఎస్ఐ లేదు పనికి తగ్గ వేతనం లేదు ఇన్సూరెన్స్ లేదు ఉపాధి కూలీలకు నాలుగు వారాల నుంచి బిల్స్ రావడం లేదు నిధుల కోత విధించారు ఉపాధి హామీని విచ్చిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని మీ ఆటలు



సాగనివ్వకుండా అడ్డుకోవడం కోసమే మే 20 జరిగే సమ్మెలో కార్మికులు కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు కావాలని ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల ఉపాధ్యక్షులు జి పాపయ్య మండల నాయకులు చంద్రమ్మ రాములమ్మ జంగయ్య రమేష్ ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు..

# ఇంకెంత దిగజారుతారు మతోన్మాదులారా..?





ఒకడు మతోన్మాదంతో ఉగ్రవాదిగా మారి సరిహద్దుల్లో అమాయకులను పొట్టన పెట్టుకున్నాడు.. మరొకడు ఆ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ దాయాదితో యుద్ధానికి దిగాడు.. ఆ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకు భారత సైన్యం రంగంలోకి దిగింది.. మేము సైతం అంటూ మహిళా లోకం ప్రాణాలకు తెగించి ముందుకు వచ్చింది.. ఈ పోరాటంలో కల్నల్ సోఫియా ఖురేషి పాత్రను ఎవరు మరువలేరు. మతం కన్నా దేశమే ముఖ్యమని తలిచి ఉగ్రవాదులపై సింహంలా విరుచుకుపడింది.. అలాంటి మహిళకు సెల్యూట్ చేయాల్సింది పోయి మంత్రి హెూదాలో ఉన్న ఒకడు ఉగ్రవాదుల సోదరులతో పోల్చాడు..మత పిచ్చి పట్టిన ఇంకొందరు సామాజిక మాధ్యమాలలో పిచ్చిరాతలు రాస్తున్నారు.. ఒక్కటే ప్రశ్న.. అక్కడ అమాయకులను అంతం చేసిన ఉగ్రవాదులకు.. ఇక్కడ నిజాయితీగా పోరాడుతున్న వారిని వాళన చేస్తున్న మీకు తేడా ఏమిటి.. మత పిచ్చి ఎవరికి పట్టినా అది ఉగ్రవాదం కన్నా ప్రమాదం.. అన్ని మతాలకు ఒకటే సూచన..మతోన్మాదులారా.. ఇకనైనా మారండి.. ఇకనైనా మానవత్వం ఉన్న మనుషుల్లో కలవండి.. మీరు కూడా మనుషులే అనిపించుకోండి.. మత మృగాలుగా మారకండి..

## గురుకుల ఇంటర్ బాలికలకు ప్రవేశాలకు

# ఈనెల 16న స్పాట్ కౌన్సిలింగ్

**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట**

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రధమ సంవత్సరం బాలికల స్పాట్ కౌన్సిలింగ్ ఖమ్మం, భద్రాద్రి రీజియన్ పరిధిలో నిర్వహించడం జరుగుతుందని అంకంపాలెం బాలికల ఆశ్రమ కళాశాల ప్రిన్సిపాల్ కె పుల్లమ్మ పేర్కొన్నారు. బుధవారం ఓ ప్రకటనలో ఆమె మాట్లాడుతూ 2025%-%26 విద్యా సంవత్సరానికి గాను ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో సీట్ల భర్తీ కొరకు ఈనెల 16న స్పాట్



కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో జరుగు ఈ స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఉదయం 9గంటలకు జరుగుతుందని కావున ఇటీవల 10వ తరగతి పూర్తికాబడిన వారు తప్పకుండా తమ ఒర్జినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోవాలని కోరారు. ఈ సదావకాశాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9490957285, 9550576274 నెంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు

# నైపుణ్య శిక్షణ తరగతులకై దరఖాస్తుల ఆహ్వానం

**ఐటిడిఎ పిఓ: రాహుల్**

**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట**

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు 45 రోజులపాటు ఉచిత నైపుణ్య శిక్షణలు కల్పించుటకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ బ్యూటీషియన్ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి నుండి ఆ పైన కోర్సులు చదివి ఉండాలని, 30 రోజుల శిక్షణ ఉంటుందని, ఐటిసి ప్రథమ్ భద్రాచలం నందు శిక్షణ ఉంటుందని, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణకు 10వ తరగతి లేదా ఆపైన కోర్సులు చదివి ఉండాలని, 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని, ఐటిసి ప్రథమ్ బూర్గంపాడు నందు శిక్షణ ఉంటుందని, టైలరింగ్ శిక్షణకు 10వ తరగతి లేదా ఆపైన కోర్సులు చదివి



ఉండాలని, 31 రోజులు శిక్షణ ఉంటుందని, పుట్టగొడుగుల పెంపకం శిక్షణ కొరకు ఏడవ తరగతి లేదా ఆపైన కోర్సులు చదివి ఉండాలని, పది రోజులపాటు శిక్షణ ఉంటుందని, జ్యూట్ బ్యాగ్స్ మేకింగ్ శిక్షణకు పదో తరగతి లేదా ఆపైన కోర్సులు చదివి ఉండాలని, 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఐటి సి భద్రాచలం మరియు ఐటీసీ ఖమ్మంలో శిక్షణ ఉంటుందని ఆయన అన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం మరియు వసతి సౌకర్యం కల్పించబడునని, ఆసక్తిగల నిరుద్యోగ గిరిజన యువత విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్, రేషన్ కార్డు/ఉపాధి హామీ బుక్కు, బ్యాంకు పాస్ బుక్ మరియు రెండు ఫోటోలతో ఈ నెల 21వ తేదీ నాడు ఉదయం 9 గంటలకు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన తెలుపుతూ, పూర్తి సమాచారం కొరకు 630 2608905, 81438 40 906 ఫోన్ నెంబర్లకు సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

# సీసీ కెమెరాల ఏర్పాటు

**తెలుగు వెలుగు..(ఏర్గట్ల మండలం)**

నిజామాబాద్ జిల్లాలోని బట్ట పూర్ గ్రామంలో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటును ఎస్సై బి రాము గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించి గ్రామంలో ఏడు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి అని మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎక్కడైనా పనిచేయని సీసీ కెమెరాలు ఉంటే వాటిని పునరుదించుకోవాలని సూచించారు సీసీ కెమెరాలు ఏర్పాటుతో గ్రామాలను సురక్షితంగా ఉంచుకోవచ్చని, దొంగల బారిన పడకుండా ఉండవచ్చని గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ అన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బత్తుల సంజీవ్ సభ్యులు రైతు రమేష్ కాటిపల్లి పెద్దసాగర్ నూకల గంగాధర్ యాదవ్ నందు రఫీ గ్రామస్తులు బాలే శ్రీనివాస్, భూఖ్య రమేష్ తదితరులు, ఎస్ఐ వెంట ఉన్నారు.




## ఆర్థిక సాయం అందజేసిన జాతియ బిసి సేన



రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం షాద్ నగర్ మున్సిపాలిటిలోని 15వ వార్డుకు సంబంధించిన వడ్ల కరుణాకర్ వయసు (35) ఆకస్మికంగా మృతి చెందిన వ్యవహారాలు బిసి సేన ఆవేదన వ్యక్తం చేసింది. వారి కటుంబ సభ్యులు తమ ఆవేదన అర్థం చేసుకొని కుటుంబ సభ్యులకు రూ. 6000 నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు పసువుల ప్రశాంత్, జిల్లా నాయులు శివ నియోజకవర్గ నాయకులు కత్తి చంద్రశేఖర్ మండల అధ్యక్షురాలు జక్కుల జలజ, చౌదరి గూడ మండల అధ్యక్షురాలు జయ శ్రవంతి రైతులు పాల్గొన్నారు.

## వివాహా వేడుకలో

## యువ నాయకులు వై. రవీందర్ యాదవ్



షాద్ నగర్ మున్సిపాలిటీ ఫరూఖ్ నగర్ కి చెందిన బీఆర్ఎస్ నాయకులు అంతారం పాండు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ యువనేత వై. రవీందర్ యాదవ్ గారు... వారి వెంట బీఆర్ఎస్ నాయకులు నటరాజ్, దేవేందర్ యాదవ్, శ్రవణ్ పట్వారి, పిల్లి శేఖర్, చీపిరి రవి యాదవ్, రామచందర్, శరత్ కృష్ణ తదితరులు ఉన్నారు.

## దేవాలయాల మరియు బొడ్రాయి ప్రతిష్ట ప్రారంభోత్సవాలకు రండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు**

**వెలిజర్ల శివాలయ పునర్నిర్మాణ కమిటీ ఆహ్వానం**



వెలిజర్ల గ్రామంలో నిర్వహించే శివాలయ, రామాలయ, నవగ్రహాలు, నాగదేవతలు, బొడ్రాయి, పోతురాజు విగ్రహాల మరియు ధ్వజస్తంభాల ప్రతిష్టాపన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శివాలయ పునర్నిర్మాణ కమిటీ వెలిజర్ల కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. తేదీ 19-05-2025 నాడు జరిగే ఈ ప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులు పుర ప్రముఖులు అధికారులు స్థానిక నాయకులందరూ రానున్నందున స్థానికంగా ముఖ్యమైన మీరు రావాలని కోరారు. ఆహ్వాన పత్రిక అందుకున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందుకు సానుకూలంగా స్పందిస్తూ గ్రామస్తులు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు, ఈ కార్యక్రమంలో శివాలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ వాద్యాల సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మరియు డిప్యూటీ సర్పంచ్ ఈరమోని రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మట్ట వెంకటేష్, సహాయ కోశాధికారి తుప్పరి కుమార్, గ్రామస్తులు మరియు గ్రామ పెద్దలు తుప్పరి మల్లయ్య, కావలి జగదీశ్వర్, పాల్గొన్నారు.

## నిరుపేదలకు "బిగ్ రిలీఫ్"..!

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ద్వారా ఆరోగ్య విషయంలో నిరుపేదలకు బిగ్ రిలీఫ్ లభిస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం అప్పారెడ్డి గూడ గ్రామానికి చెందిన చిన్నంతర గారి అఖిలేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కొత్తూరు నందిగామ ఉమ్మడి మండలాల ఎంపీపీ శివశంకర్ గౌడ్, మర్దర్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కుమార్ గౌడ్, మైనార్టీ నేత మహమ్మద్ ఇబ్రహీం, రాజు, శ్రీహరి గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు బిగ్ రిలీఫ్ లాంటిదని అన్నారు. సాయంత్రం మరింత మందికి సీఎం రిలీఫ్ ఫండ్ తదితర సంక్షేమాలకు సంబంధించిన చెక్కులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.


# డ్రోన్లు మాత్రమే కాదు.. పాక్‌కు టర్కీ సైనిక సాయం

## వెలుగులోకి విస్తుగొలిపే విషయాలు!

**భారత్‌పై దాడులకు పాక్‌కు టర్కీ డ్రోన్లు, సైనిక సహకారం**

**'ఆపరేషన్ సిందూర్'లో ఇద్దరు టర్కీ సైనికుల మృతి చెందినట్లు వార్తలు**

**కూల్చివేసిన డ్రోన్లు టర్కీ 'అసిస్ గార్డ్ సోంగర్' రకానికి చెందినవని నిర్ధారణ**



భారత వ్యతిరేక కార్యకలాపాల కోసం పాకిస్థాన్‌కు టర్కీ డ్రోన్లను సరఫరా చేయడమే కాకుండా, తమ సైనిక సిబ్బందిని కూడా పంపిందన్న ఆరోపణలు సంచలనం కలిగిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ సంబంధాలు బలపడుతున్న నేపథ్యంలో ఈ వార్తలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' పేరిట జరిగిన ఘటనల్లో టర్కీకి చెందిన సైనికులు పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో పాకిస్థాన్, టర్కీల మధ్య రక్షణ ఒప్పందాలు ఊపందుకున్నాయి. భారత్‌పై దాడులే లక్ష్యంగా పాకిస్థాన్‌కు టర్కీ వందల సంఖ్యలో అత్యాధునిక డ్రోన్లను అందించింది. ఈ డ్రోన్ల వినియోగంపై పాక్ సైనికులకు శిక్షణ ఇచ్చేందుకు టర్కీ సైనిక నిపుణులను ఇస్లామాబాద్‌కు పంపినట్లు వార్తలు తెలుస్తోంది.'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్ జరిపిన ప్రతిదాడుల్లో ఇద్దరు టర్కీ సైనికులు మరణించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ఆపరేషన్ అనంతరం పాకిస్థాన్ సుమారు 300 నుంచి 400 డ్రోన్లను భారత భూభాగంపైకి ప్రయోగించగా, వాటిని భారత బలగాలు సమర్థవంతంగా కూల్చివేశాయి. ఈ డ్రోన్ల శకలాలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలించగా, అవన్నీ టర్కీకి చెందిన 'అసిస్ గార్డ్ సోంగర్' రకం డ్రోన్లుగా నిర్ధారించారు. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ మొదటి నుంచి భారత వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తుంటారని తెలిసిందే. ఆయన అనేక అంతర్జాతీయ వేదికలపై ఈ విషయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి ఘటనను ప్రపంచ దేశాలు ఖండించినప్పటికీ, ఎర్డోగాన్ మాత్రం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఉగ్రదాడిని ఖండించకపోగా, మృతుల కుటుంబాలకు కనీసం సానుభూతి కూడా వ్యక్తం చేయకపోవడం గమనార్హం. పహల్గామ్ దాడి అనంతరం ముస్లిం దేశాల్లో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచినవి టర్కీ, అజర్‌బైజాన్ మాత్రమే కావడం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. కశ్మీర్ అంశంలో కూడా ఎర్డోగాన్ పలుమార్లు భారత్‌పై విమర్శలు చేశారు.

# భారత్ సాధించింది మామూలు విజయం కాదు

## యుద్ధతంత్ర నిపుణుడు జాన్ స్పెన్సర్

**- ఆపరేషన్ సింధూర్‌తో భారత సైనిక సిద్ధాంతంలో కీలక మార్పు.**

**- నిష్పాక్షిక విజయం అని పేర్కొన్న వెస్ట్ పాయింట్ - నిపుణుడు జాన్ స్పెన్సర్**

**- రాజ్య ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ 'రెడ్ లైన్' గీసిందని కితాబు**




భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దేశ సైనిక సిద్ధాంతంలో ఒక నిర్ణయాత్మక మార్పును సూచిస్తోందని, కచ్చితమైన వైమానిక దాడులను వ్యూహాత్మక సంయమనంతో మేళవించిందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆధునిక యుద్ధ తంత్రాలపై ప్రపంచంలోని అగ్రగామి నిపుణులలో ఒకరైన వెస్ట్ పాయింట్‌కు చెందిన జాన్ స్పెన్సర్, ఈ ఆపరేషన్‌ను 'నిష్పాక్షిక విజయం'గా అభివర్ణించారు. ఇది సాధారణ విజయం కాదు... భారీ విజయం అని పేర్కొన్నారు. దాని స్పష్టత, అమలు తీరును ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చర్య ద్వారా భారత్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే కాకుండా, పాకిస్థాన్ ప్రతిదాడులను సమర్థవంతంగా నిర్వీర్యం చేసి, తన రెసిస్టెన్స్ పవర్ ను పునర్నిర్వచించిందని ఆయన పేర్కొన్నారు. పూర్తిస్థాయి యుద్ధానికి దిగకుండానే, రాజ్య ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ తన దృఢ సంకల్పాన్ని తెలియజేస్తూ ఒక కొత్త 'రెడ్ లైన్' గీసిందని తెలిపారు. జాన్ స్పెన్సర్ విశ్లేషణ "కేవలం నాలుగు రోజుల నియంత్రిత సైనిక చర్యతో భారతదేశం భారీ విజయాన్ని సాధించింది. ఆపరేషన్ సిందూర్ తన వ్యూహాత్మక లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా, వాటిని అధిగమించింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయడం, సైనిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడం, నిరోధక శక్తిని పునరుద్ధరించడం మరియు నూతన జాతీయ భద్రతా సిద్ధాంతాన్ని ఆవిష్కరించడం వంటివి ఇందులో ఉన్నాయి. ఇది కేవలం ప్రతీకాత్మక శక్తి ప్రదర్శన కాదు. ఇది నిర్ణయాత్మక శక్తి, స్పష్టంగా వర్తింపజేయబడింది" అని జాన్ స్పెన్సర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

**భారత వ్యూహాత్మక పరివర్తన**

ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఈ దాడికి లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" బాధ్యత వహించింది. గత సంఘటనలకు భిన్నంగా, న్యూఢిల్లీ దౌత్యపరమైన హెచ్చరికలు జారీ చేయడం లేదా బహుపాక్షిక ఖండనలను కోరడం వంటివి చేయలేదు. బదులుగా, యుద్ధ విమానాలను ప్రయోగించిందని స్పెన్సర్ తన పోస్ట్‌లో తెలిపారు.

మే 7న ప్రారంభమైన నాలుగు రోజుల పాటు అత్యంత సమన్వయంతో, భారత్ తొమ్మిది లోతైన చొచ్చుకెళ్లే దాడులను నిర్వహించింది. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ల సమూహాన్ని నిర్వీర్యం చేసి, ఆరు సైనిక వైమానిక స్థావరాలు మరియు యూఏవీ కమాండ్ హబ్‌లను లక్ష్యంగా చేసుకుంది. దీనికి సమాంతరంగా, భారత సాయుధ దళాలు తమ గగనతలాన్ని రక్షించుకునే సామర్థ్యాన్ని, స్వదేశీ ఆయుధ వ్యవస్థలను మోహరించే తీరును, ఎలక్ట్రానిక్ మరియు సైబర్ యుద్ధంతో సహా బహుళ క్షేత్ర సామర్థ్యాలను ప్రదర్శించాయి. ఆ తర్వాత కాల్పుల విరమణ చోటుచేసుకుంది. భారత సైనిక అధికారుల మాటల్లో చెప్పాలంటే, ఇది 'వ్యూహాత్మక విరామం' %-% కార్యాచరణ విరమణ మాత్రమే. ఈ పరిమితమైన, శక్తివంతమైన వైఖరినే స్పెన్సర్ ప్రముఖంగా ప్రస్తావించారు.

**సాధించిన వ్యూహాత్మక లక్ష్యాలు**

స్పెన్సర్ ప్రకారం, ఆపరేషన్ సింధూర్ భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి లేదా ప్రతీకారం తీర్చుకోవడానికి జరిగిన యుద్ధం కాదు, స్పష్టమైన లక్ష్యాలతో కూడిన పరిమిత ప్రచారం, మరియు అవన్నీ నెరవేరాయి: కొత్త రెడ్ లైన్: పాకిస్థాన్ భూభాగం నుంచి జరిగే ఉగ్రవాద దాడులను యుద్ధ చర్యలుగా పరిగణిస్తామని, భవిష్యత్ ప్రతిస్పందనలకు ఒక ప్రమాణాన్ని నిర్దేశిస్తామని భారత్ స్థాపించింది. ప్రధాని మోదీ చెప్పినట్లుగా, "ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవు. నీరు, రక్తం కలిసి ప్రవహించవు." అనే సందేశాన్ని భారత్ చర్యల ద్వారా బలపరిచింది. సైనిక ఆధిపత్యం: ఉగ్రవాద మరియు సైనిక లక్ష్యాలపై ఇష్టానుసారం దాడి చేయగల భారత సామర్థ్యం, పాకిస్థాన్ ప్రతిదాడులను నిర్వీర్యం చేయడం, ఇరు దేశాల సామర్థ్యాల మధ్య ఉన్న స్పష్టమైన అసమానతను నొక్కి చెప్పింది. ఉద్రిక్తతను పెంచి, పూర్తిస్థాయి యుద్ధానికి కొద్ది దూరంలో ఆపడం ద్వారా, సంఘర్షణ వేగం మరియు పరిధిపై తన నియంత్రణను భారత్ సూచించింది. ఆపరేషన్ సింధూర్‌తో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగంగా ప్రకటించినట్లుగా, "భారత్ ఎలాంటి అణ్వస్త్ర బెదిరింపులను సహించదు. అణ్వస్త్ర బెదిరింపుల ముసుగులో అభివృద్ధి చెందుతున్న ఉగ్రవాద స్థావరాలపై భారత్ కచ్చితంగా, నిర్ణయాత్మకంగా దాడి చేస్తుంది" అనే నూతన జాతీయ భద్రతా సిద్ధాంతాన్ని భారత్ ఆవిష్కరించింది... అని స్పెన్సర్ వివరించారు.

# టర్కీ, చైనా మీడియా సంస్థల సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేసిన భారత్

**- ఆపరేషన్ సిందూర్ పై అసత్య ప్రచారం**

**- తీవ్రంగా స్పందించిన భారత్ - టీఆర్టీ వరల్డ్, గ్లోబల్ టైమ్స్ ఎక్స్ ఖాతాలకు చెక్**



భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసిందన్న ఆరోపణలపై టర్కీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రసార సంస్థ 'టీఆర్టీ వరల్డ్' ఎక్స్ ఖాతాను భారత ప్రభుత్వం బుధవారం నిలిపివేసింది. పాకిస్థాన్ ఉపయోగించిన టర్కీ నిర్మిత డ్రోన్లు భారత గగనతలంలోకి చొరబడినట్లు ఫోరెన్సిక్ నివేదికలు వెల్లడైన కొద్ది రోజులకే ఈ చర్య తీసుకోవడం గమనార్హం. పాకిస్థాన్ చేసిన చొరబాటు యత్నాన్ని భారత రక్షణ దళాలు తక్షణమే తిప్పికొట్టాయి, భారత భూభాగానికి ఎలాంటి నష్టం జరగకుండా చూసుకున్నాయి. అదే సమయంలో, చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా సంస్థలైన గ్లోబల్ టైమ్స్, జిన్హువాలకు చెందిన ఎక్స్ ఖాతాలను కూడా కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో భారత సైన్యం గురించి ధృవీకరించని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఈ సంస్థలు వ్యాప్తి చేస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ఈ ఖాతాలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తే, "ఖాతా నిలిపివేయబడింది. చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా ఏ%తీషశీతీశ్రీ౧% భారతదేశంలో నిలిపివేయబడింది" అనే సందేశం కనిపిస్తోంది.'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్తాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ కచ్చితమైన వైమానిక దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ దాడుల అనంతరం టీఆర్టీ వరల్డ్ తప్పుడు సమాచారం, నకిలీ వార్తలను ప్రచారం చేసినట్లు గుర్తించారు.

# దేవాలయాలు ధర్మ ప్రబోధం చేస్తాయి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**ఎల్లికట్ట హనుమాన్ దేవాలయ ప్రారంభోత్సవంలో**

**పూజలు నిర్వహించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**



గ్రామాల్లో దేవాలయాలు ఆధ్యాత్మిక ప్రబోధాన్ని చేస్తాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి, సీత రాములు, విఘ్నేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర నవగ్రహ ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి హాజరైన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి దేవాలయలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎల్లికట్టలో అద్భుతమైన దేవాలయం నిర్మిచారని ఆలయకమిటీ పెద్దలను గ్రామస్థులను ఆయన అభినందించారు. దేవాలయం ఆధారముగా ప్రతి వ్యక్తిలో ఆధ్యాత్మికతను, ధర్మ అనుసారముగా జీవనం కొనసాగించటానికి కావలసిన స్ఫూర్తిని నిరంతరం కోన సాగించాలని అన్నారు. శివతత్వం అలవర్చుకుని,సీతా శ్రీరామ చంద్ర ప్రభు సుగుణాలను గుర్తుకు చేసుకుంటూ అభయ ఆంజనేయ స్వామి కార్యదీక్షతను గుర్తుకు చేసుకుంటూ ధర్మం కోసం జీవించాలి అని అన్నారు. దేవాలయ కమిటీ పెద్దలు కాషాయ కండువాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో బీజేపీ నాయకులు వంశీ కృష్ణ కుర్మయ్య ,ప్రశాంత్, ఎంకోనోళ్ళ వెంకటేష్ ,నరేష్ ,నరసింహ ,మదన్ మరియు గ్రామా పెద్దలు పాల్గొన్నారు..

## ఎమ్మెల్యే జారెకు కెజిబివి

# పాఠశాలల పిఇటిల వినతి



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట**

కెజిబివి పాఠశాలలో పనిచేసే పిఇటి ఉపాధ్యాయులు వేతన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జారెను పిఇటిలు కలుసుకొని మాట్లాడుతూ ఉపాధ్యాయులతోఓ పోల్చితే తక్కువ వేతనం అందుకుంటున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించి వేతనాల పెంపుకు కృషిచేయాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ ఉన్నతస్థాయి యంత్రాంగం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే జారె పేర్కొన్నారు.

# నోబెల్ శాంతి బహుమతికి గురి పెట్టిన ట్రంప్ !



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏ మాత్రం సిగ్గుపడరు. తనకు కావాల్సిందేదో నిర్మోహమాటంగా అడుగుతారు. తాను మొదటి సారి అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు చేసిన ఘనకార్యాలకు తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని బహిరంగంగానే సిఫారసు చేసుకున్నారు. అయితే అప్పట్లో ఆయన చేసిన పనులు శాంతి రేపకపోగా అశాంతికి కారణం అయ్యాయని కనీసం లెక్కలోకి కూడా తీసుకోలేదు. కానీ ఇప్పుడు ఆయన గట్టిగానే తనను తాను ప్రమోట్ చేసుకుంటున్నారు. ఇందుకు భారత్ పాకిస్తాన్ లను వాడుకుంటున్నారు.తాను భారత్, పాక్ మధ్య అణుయుద్ధాన్ని నివారించానని లక్షల మంది ప్రాణాలు పోకుండా కాపాడానని ట్రంప్ ప్రకటించుకుంటున్నారు. వారి మధ్య యుద్ధాన్ని ఆపడానికి తాను బెదిరింపులకు కూడా దిగానన్నారు. అమెరికాలోనే కాదు..ఖతార్ పర్యటనకు వచ్చి అదే చెబుతున్నారు. అయితే తమ మధ్య అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వం చేయలేదని భారత్, పాకిస్తాన్ చెబుతున్నాయి. కానీ ట్రంప్ మాత్రం..తానే చేయించానని చెప్పుకుంటున్నారు. ఉక్రెయిన్, రష్యా మధ్య కూడా తానే ఉద్రిక్తతల్ని తగ్గించానని ఆయన ప్రచారం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. యుద్ధం చేసి చేసి అలసిపోయిన ఆ రెండు దేశాలు.. ప్రస్తుతానికి కాల్పుల విరమణ పాటించాలని అనుకుంటున్నాయి. దీన్ని తన ఖాతాలో ట్రంప్ వేసుకోనున్నారు. ట్రంప్ వ్యవహారం అమెరికా అధ్యక్షుడిగా వ్యక్తిగత లాభాలు పొందడానికి అన్నట్లుగా సాగుతోంది. ఆయన నిజంగా పెద్దన్న పాత్ర పోషించాలంటే.. దానికి వేరే మార్గాలున్నాయి. కానీ చిల్లర చిల్లర ప్రయత్నాలు చేసి..క్రెడిట్ కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీని వల్ల అమెరికా ఇమేజే ప్రపంచదేశాలు ముందు పోతోంది. అయినా ట్రంప్ మాత్రం.. తన మార్క్ తనదని అనుకుంటున్నారు.

# కల్నల్ సోఫియా ఖురేషిపై మంత్రి వ్యాఖ్యలు..

## తీవ్రంగా స్పందించిన జాతీయ మహిళా కమిషన్

**మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జాతీయ మహిళా కమిషన్**

**ఇది మహిళల గౌరవాన్ని, దేశ సేవకురాళ్ళను అవమానించడమేనన్న ఛైర్‌పర్సన్**

**పెరుగుతున్న విమర్శలతో దిగొచ్చిన మంత్రి విజయ్ షా, క్షమాపణలు వెల్లడి**



మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా, సైనికాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు మహిళల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని స్పష్టం చేసింది. పెరిగిన వ్యతిరేకత నేపథ్యంలో మంత్రి విజయ్ షా తన వ్యాఖ్యలపై క్షమాపణలు తెలిపారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో మీడియాకు వివరాలు వెల్లడించిన సైనికాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీపై మంత్రి విజయ్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహాట్కర్ ఈ ఘటనపై స్పందిస్తూ, "కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు స్త్రీల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఇది మన సమాజంలోని మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న మన కుమార్తెలను అవమానించినట్లు అవుతుంది" అని పేర్కొన్నారు. మంత్రి పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు మహిళల పట్ల గౌరవప్రదమైన వైఖరిని అలవర్చుకోవాల్సిన ఆవశ్యకతను విజయ రహాట్కర్ నొక్కిచెప్పారు. "కల్నల్ సోఫియా ఖురేషీ దేశం గర్వించదగ్గ భారత పుత్రిక. దేశాన్ని ప్రేమించే ప్రతి భారతీయుడికి ఆమె సోదరి వంటివారు. ఆమె ఎంతో ధైర్యంతో, అంకితభావంతో దేశానికి సేవ చేస్తున్నారు. అటువంటి మహిళలను చూసి దేశం గర్వపడుతోంది. దేశం ప్రగతి పథంలో పయనించాలంటే మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు వచ్చి నాయకత్వం వహించాలి. మహిళలపై అగౌరవ వ్యాఖ్యలు చేయడం దేశాభివృద్ధిని అడ్డుకోవడమే" అని విజయ రహాట్కర్ సామాజిక మాధ్యమం వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి విజయ్ షా ప్రసంగిస్తూ, "వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేశారు. వాళ్ల (ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో మోదీజీ పాక్‌కు పంపించి పాఠం నేర్పించారు" అంటూ కర్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. మంత్రి వ్యాఖ్యలు అత్యంత సిగ్గుచేటుగా, కించపరిచేవిగా ఉన్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. మంత్రి విజయ్ షాను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నేతలు ప్రధానమంత్రిని డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవడంతో మంత్రి విజయ్ షా వెనక్కి తగ్గారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, "ఉగ్రవాదుల దుశ్చర్యలతో నా మనసు తీవ్రంగా కలత చెందింది. ఆ ఆవేదనలోనే అలాంటి వ్యాఖ్యలు చేశాను. కులమతాలకు అతీతంగా దేశానికి కల్నల్ ఖురేషీ అందిస్తున్న సేవలకు నేను సెల్యూట్ చేస్తున్నాను. ఆమెను కించపరిచే ఆలోచన నాకు కలలో కూడా రాదు. నా మాటలు ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే, పదిసార్లు క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని తెలిపారు.

# తెలంగాణ బీజేపీ నేతల టైంపాస్ పాలిటిక్స్ !



తెలంగాణ బీజేపీ నేతలు కొంతమంది తమ క్రెడిబులిటి కోల్పోతున్నారు. ఇష్టారీతిన మాట్లాడుతూ స్థాయిని దిగజార్చుకుంటున్నారు. సంచనాలకు కేంద్ర బిందువుగా నిలవాలని ఆరాటమో ఏమో కానీ తరుచుగా ఏదో అంశంపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. వార్తల్లో హైలెట్ అవుతున్నారు కానీ, వారు చెప్పిన మాటలకు కట్టుబడి ఉండకపోవడం, ఆ కామెంట్స్ సత్యదూరమై ఉండటంతో బీజేపీ నేతల వ్యాఖ్యలను అంతా లైట్ తీసుకుంటున్నారు. తాజాగా బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కాంగ్రెస్ లో విలీనం అవుతుందని జోస్యం చెప్పారు. జూన్ రెండో తేదీన లేదా డిసెంబర్ లో విలీనం ఉంటుందని తర్వాత కేసీఆర్ సీఎంగా ప్రమాణం చేస్తారన్నారు.ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మార్పు ఖాయమని చెప్పుకొచ్చారు. ఇందుకు ఆయన చెప్పిన లాజిక్..పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతున్న హరీష్ , కేసీఆర్ వెంట నడుస్తానని ప్రకటించడమేనట. ఇది సిల్లీ లాజిక్ అని ఎవరికైనా అనిపిస్తోంది. ఒక్క ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాత్రమే కాదు..గతంలో లక్ష్మణ్ కూడా తెలంగాణ కాంగ్రెస్ లో ఆగస్ట్ సంక్షోభం తప్పదని బిగ్ బాంబ్ పేల్చారు. ప్రభుత్వం కుప్పకూలుతుందని రేవంత్ సర్కార్ కు వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీకి ఉండటంతో ఈ విషయంపై తీవ్ర ప్రకంపనలు రేగాయి. ఆ తర్వాత అలాంటిదెం లేకపోవడంతో అదంతా టైం పాస్ పాలిటిక్స్ లో భాగమని క్లారిటీ వచ్చింది. అలాగే, బీజేపీ ఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి తారస్థాయికి చేరుకుందని, మంత్రులంతా కుంభకోణంలో బిజీగా ఉన్నారని గతేడాది ఆరోపించారు. ఒక్కొక్క మంత్రి బాగోతం త్వరలోనే బయటపెడుతానని చెప్పారు. కానీ, ఆయన ఏ మంత్రి స్కామ్ వివరాలను బయటపెట్టకపోవడంతో.. సంచలనాల కోసమే బీజేపీ నేతలు ఇలా మాట్లాడుతారని అందరికీ మరోసారి స్పష్టత వచ్చినట్లు అయింది. ఇప్పుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కామెంట్స్ ను తెలంగాణ రాజకీయ పరిశీలకులు కూడా ఆ కోవలో చూస్తున్నారు.

# పాకిస్థాన్‌లో హిందూ యువతి కశీష్ చౌదరి రికార్డ్

**బలూచిస్థాన్ అసిస్టెంట్ కమిషనర్ గా హిందూ యువతి కశీష్ చౌదరి నియామకం**

**పాక్ లో ఈ పదవి చేపట్టిన తొలి హిందూ మహిళగా రికార్డ్**

**పాక్ పాలనలో రాణిస్తున్న మనీష్, పుష్ప, సుమన్ వంటి ఇతర హిందూ మహిళలు**




పాకిస్థాన్‌లో ఒక హిందూ మహిళ అరుదైన ఘనతను సాధించారు. కశీష్ చౌదరి (25) అనే యువతి, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులై చరిత్ర సృష్టించారు. ఈ ఉన్నత పదవిని అలంకరించిన తొలి హిందూ మహిళగా ఆమె రికార్డు నెలకొల్పారు. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ వంటి వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతంలో, ఒక హిందూ మతానికి చెందిన మహిళ సివిల్ సర్వీసెస్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బలూచిస్థాన్‌లోని చాగై జిల్లాకు చెందిన నోష్కి అనే చిన్న పట్టణం కశీష్ చౌదరి స్వస్థలం. ఆమె తండ్రి గిరిధారి లాల్ ఒక మధ్యస్థాయి వ్యాపారి. ఉన్నత లక్ష్యంతో బలూచిస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (%దీ్రూజ%) పరీక్షలకు సిద్ధమైన కశీష్, మూడేళ్ల పాటు అకుంఠిత దీక్షతో శ్రమించారు. రోజుకు కనీసం ఎనిమిది గంటల పాటు చదువుపైనే దృష్టి కేంద్రీకరించినట్లు ఆమె తెలిపారు. తన ఈ విజయం వెనుక క్రమశిక్షణ, కఠోర శ్రమతో పాటు సమాజానికి సేవ చేయాలన్న ప్రబలమైన ఆకాంక్ష ఉన్నాయని కషిష్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాలలో పాకిస్థాన్‌లో పలువురు హిందూ మహిళలు ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవులు చేపడుతూ సాంస్కృతిక, సామాజిక అవరోధాలను ఛేదిస్తున్నారు. ఈ కోవలో కశీష్ చౌదరి విజయం మరింత స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. గతంలో కూడా కొందరు హిందూ మహిళలు ఇలాంటి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. 2022లో మనీష్ రూపేట కరాచీ నగరానికి తొలి హిందూ మహిళా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా, పుష్పా కుమారి కోహ్లి సింధ్ పోలీస్ పబ్లిక్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సబ్-ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. 2019లో సుమన్ పవన్ బోదాని షాదాద్‌కోట్‌లో తొలి హిందూ మహిళా సివిల్ జడ్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

# మీరు రాత్రి పూట నిద్రపోతారా..? సౌదీ యువరాజుకు ట్రంప్ వింత ప్రశ్న

**ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్న అమెరికా అధ్యక్షుడు**

**మంగళవారం రియాద్ చేరుకున్న ట్రంప్**

**సౌదీని ఎంతో గొప్పగా చేశారంటూ యువరాజుపై ప్రశంసలు**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం రియాద్ చేరుకున్న ట్రంప్... ఈ నగరాన్ని ప్రపంచ ప్రధాన వ్యాపార కేంద్రంగా మార్చినందుకు సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా సౌదీ యువరాజుకు ట్రంప్ ఓ వింత ప్రశ్న వేశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది. "మహమ్మద్.. మీరు రాత్రి పూట నిద్రపోతారా..? మీరు ఎలా నిద్రపోతారు? సౌదీని ఎంతో గొప్పగా చేశారు. మాలో ఒకరిలా ఉంటూనే.. ఇంతలా ఎలా అభివృద్ధి చేశారు. సౌదీ అరేబియా అభివృద్ధిపై విమర్శకులకు ఎన్నో అనుమానాలు ఉండేవి.

వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ అభివృద్ధి చేసి చూపించారు. తన దేశాన్ని శక్తివంతమైన వ్యాపార కేంద్రంగా నిర్మించారు. నాకు మీరంటే ఎంతో అభిమానం" అంటూ ట్రంప్ సౌదీ ప్రిన్స్‌పై ప్రశంసల జల్లు కురిపించారు.

ఇక, ఇదే సమావేశంలో సిరియాపై ఉన్న ఆంక్షలను తొలగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తుర్కియే అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమట !




రాజకీయాల్లో నేతల మాటలకు అర్థాలు వేరుగా ఉంటాయో.. లేదో కానీ నేరుగా మాట్లాడిన మాటలకు రాజకీయ నేతలు ఎవరి అర్థాలు వారు తీసుకుంటారు. ఈ విషయాన్ని బీజేపీ నేతలు మరోసారి నిరూపించారు. కేసీఆర్ మాటే తన బాట అని హరీష్ రావు మంగళవారం ప్రకటించారు. పార్టీ మారడమో.. కొత్త పార్టీ పెడతారనో ప్రచారం జరుగుతున్న సమయంలో హరీష్ రావు ఈ వివరణ ఇచ్చారు. ఇలాంటి ప్రచారాలు ఇప్పుడు కాదు.. ఎప్పట్నుంచో జరుగుతున్నాయి. హరీష్ రావు కూడా అదే చెబుతున్నారు ఇందులో కొత్తేం లేదు కానీ.. కొత్తగా బీజేపీ నేతలకు హరీష్ రావు మాటల్లో విలీనం అనే అర్థం వినిపించింది. బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం ముహూర్తం ఖరారు అయిందని స్టేట్ మెంట్ ఇచ్చారు. దానికి ఆధారం ఏమిటంటే హరీష్ రావు మాట్లాడిన మాటలట. కేసీఆర్ బాటలోనే నడుస్తానని హరీష్ రావు చెప్పడమే దానికి నిదర్శనమన్నారు జూన్ రెండో తేదీన లేదా డిసెంబర్ లో విలీనం ఉంటుందని తర్వాత కేసీఆర్ సీఎంగా ప్రమాణం చేస్తారన్నారు. రేవంత్ రెడ్డి మార్పు ఖాయమని చెప్పుకొచ్చారు. అందుకే హరీష్ రావు కేసీఆర్ వెంటనే నడుస్తానని చెబుతున్నాని చెప్పుకొచ్చారు. బీజేపీ నేతల మాటల్లో ఇసుమంత కూడా లాజిక్ లేదు. అయినా ఇదేదో పెద్ద సీక్రెట్ అన్నట్లుగా ప్రెస్మీట్ పెట్టి చెప్పేశారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం చేసే దానికి అయితే.. ఇటీవల భారీగా ఖర్చు పెట్టుకుని రజతోత్సవ వేడుకలు నిర్వహించాల్సిన అవసరం ఉండేది. ఇప్పటికిప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ ఉందని కూడా అనుకోలేరు. ఇలాంటి సమయంలో పార్టీని విలీనం చేస్తారని బీజేపీ నేతలు మాత్రమే అనుకుంటారు. అనుకోవడమే కాదు.. గొప్ప సీక్రెట్ కనిపెట్టామని మీడియా ముందుకు వచ్చి చెబుతూంటారు కూడా.

## భారత్‌ను రెచ్చగొడుతోన్న పాక్, చైనా !



భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా పూర్తిస్థాయిలో తగ్గనేలేదు.. మరోవైపు నుంచి చైనా భారత్ ను రెచ్చగొట్టే చర్యలకు దిగింది. దేశ సార్వభౌమత్వంపై దాడి చేసేలా వ్యవహరిస్తోంది. డ్రాగన్ కంత్రీ వైఖరిని తిప్పికొడుతూ భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ తనదే అంటూ మరోసారి చైనా చెప్పుకునే ప్రయత్నం చేసింది. అయితే ఈసారి అరుణాచల్ ప్రదేశ్ కు కొత్త పేరు కూడా పెట్టేసింది. జంగ్నాన్ గా వ్యవహరిస్తూ టిబెట్ దక్షిణ ప్రాంతం అంటూ అరుణాచల్ ప్రదేశ్ ను తన మ్యాప్ లో ప్రదర్శించింది. దీనిపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ.. పేర్లు మార్చుకున్నంత మాత్రానా.. నిజాలు అబద్దాలు అవుతాయా? అంటూ చైనాకు కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ పై చాలా కాలంగా భారత్ %-% చైనా మధ్య వివాదం నడుస్తోంది. ఇప్పటికే టిబెట్ ను తనలో కలిపేసుకున్న చైనా.. తన ఫోకస్ ను అరుణాచల్ ప్రదేశ్ పై పెట్టింది. అందులో భాగంగా అప్పుడప్పుడు భారత్ ను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తోంది. ఎనిమిదేళ్లుగా అరుణాచల్ ప్రదేశ్ లోని పలు ప్రాంతాలకు చైనీస్ లాంగ్వేజ్ లో పేర్లు కూడా పెడుతోంది. 2017లో 6 ప్రదేశాల పేర్లను మార్చింది. దీని తర్వాత, 2021లో 15 ప్రదేశాల పేర్లను మార్చారు. ఆ తరువాత 2023లో 11, 2024లో గరిష్టంగా 30 ప్రదేశాల పేర్లను మార్చారు. ఇందులో పర్వతాలు, నదులు, సరస్సులు, నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పుడు అరుణాచల్ ప్రదేశ్ భూభాగాన్ని చైనా ప్రాంతంగా గుర్తిస్తూ మ్యాప్ ను విడుదల చేసింది డ్రాగన్ కంత్రీ. దీనిపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అయితే,పాక్ -భారత్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న క్రమంలోనే చైనా ఈ అరుణాచల్ ప్రదేశ్ పై వివాదాస్పదంగా వ్యవహరించడంపై చర్చ జరుగుతోంది.

## హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ సీరియస్



హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఆగ్రహం తెప్పించారు హయత్ నగర్ సీఐ. వివాదాస్పద భూముల విషయంపై బాధితులు ఫిర్యాదు చేసినా ఎందుకు కేసు నమోదు చేయలేదని సీరియస్ అయ్యారు. పోలీసులు ఉన్నది బాధితుల కోసమే కదా.. మరెందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. కోహెడలో తమ ప్లాట్లను కబ్జా చేశారని బాధితులు ప్రజావాణిలో భాగంగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రంగనాథ్ ను కలిసి వివరించారు. ఈ క్రమంలోనే ఆ వివాదాస్పద స్థలాన్ని బుధవారం రంగనాథ్ పరిశీలించారు. అయితే , ఆ ల్యాండ్ లో మారణాయుధాలు ఉండటం చూసి రంగనాథ్ అవాక్కయ్యారు. మరోసారి విషయం పూర్తిగా తెలుసుకొని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులపై దాడి జరిగినా, మారణాయుధాలు ల్యాండ్ లో ఉన్నా ఎందుకు కేసులు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐని ప్రశ్నించారు. వెంటనే బాధితుల ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# పాకిస్తాన్ హై కమీషన్ అధికారి దేశ బహిష్కరణ

**న్యూ ఢిల్లీ:మే 14**
భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న సమయంలో, దౌత్యపరంగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఒక అధికారిని తక్షణమే దేశం విడిచి వెళ్లాల్సిందిగా భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన కార్యకలాపాలు దౌత్య హోదాకు అను గుణంగా లేవన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి, తన అధికారిక హోదాకు తగని కార్యకలా పాల్లో నిమగ్నమైనట్లు భారత ప్రభుత్వం గుర్తించింది. దౌత్యపరమైన నిబంధ నలను ఉల్లంఘిస్తూ, కార్యాలయ పరిధిని దాటి వ్యవహరించినందున ఆయనను దేశం నుంచి బహిష్కరించాలని నిర్ణయించినట్లు భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకట నలో తెలిపింది. సదరు పాకిస్థానీ అధికారి 24 గంటల్లోగా భారతదేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని భారత్‌లోని పాకిస్థాన్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అత్యున్నత అధికారికి అధికారికంగా తెలియజేసినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే, బహిష్కరణకు గురైన ఉద్యోగి పేరును, ఆయన




హోదాను మాత్రం ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పం దం అమల్లో ఉన్నప్పటికీ, దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసే ఈ చర్య ప్రాధా న్యత సంతరించుకుంది.

# కరాటేలో సత్తా చాటిన నవాబ్ పేట్ మండల పులుమామిడి గ్రామానికి చెందిన స్పర్షిత

**మలేషియాలో ప్రతిభ కనబర్చిన స్పర్షిత ను అభినందిస్తున్న మండల ప్రజలు**

**మాస్టర్ మహేష్ ,మాస్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 14 తెలుగు వెలుగు:** మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ ఒకినావా గోజు టైపా సిటీ 21 ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2025 లో వికారాబాద్ జిల్లా నవపేట్ మండలం పులుమామిడి గ్రామానికి చెందిన స్పర్షిత కటా లో గోల్డ్ మెడల్ ,కుమిటీలో సిల్వర్ మెడల్ సాధించింది. గత 3,4 సంవత్సరాల నుండి చిట్టిగిద్ద గ్రామానికి చెందిన మాస్టర్ మహేష్ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా కరాటే లో శిక్షణ ఇస్తున్నాడు. ముఖ్యంగా అమ్మాయిలు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎదుర్కొనుటకు కచ్చితంగా కారటె నేర్చుకోవాలని శిక్షణ ఇస్తున్నాడు.ఇందులో భాగంగా గతంలో కూడా నవబ్ పేట్ మండలానికి చాలా మెడల్స్





తెప్పించాడు.అదేవిధంగా ఇప్పుడు కూడా పులిమామిడి గ్రామానికి చెందిన స్పర్శిత మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ లో గోల్డ్ మెడల్ తో పాటు సిల్వర్ మెడల్ కూడా సాధించడం జరిగింది.స్పర్షిత మాస్టర్ మహేష్ మాస్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా మాస్టర్ మహేష్ మాట్లాడుతూ స్పర్షితను స్ఫూర్తిగా తీసుకొని తల్లిదండ్రులు వారి పిల్లలకి శిక్షణ శిక్షణ ఇప్పించాలని వారిని వారు కాపాడుకోవడానికి కరాటే ఉపయోగపడుతుందని , అమ్మాయిల ఆత్మరక్షణ కొరకు శిక్షణ ఇస్తానని ఈ సందర్భంగా మాస్టర్ మహేష్ చెప్పడం జరిగింది.

## జిహెచ్ఎంసి ఏఈని పరామర్శించిన ఎమ్మెల్యే కృష్ణారావు...

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జిహెచ్ఎంసి ఏ ఈ శ్రీనివాస్ ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పరామర్శించారు.మియాపూర్ పల్స్ హార్ట్ ఆసుపత్రిలో స్టంట్ వేసుకుని చికిత్స పొందుతున్న శ్రీనివాస్ ని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గూర్చి ఆసుపత్రి వైద్యుల తో మాట్లడి వివరాల ను



ఎమ్మెల్యే కృష్ణారావు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని శ్రీనివాస్ కు ధైర్యం చెప్పారు.

# సహకార రంగం బలోపేతం కావాలి

**- రైతులను ఆదుకునేలా కమిటీల ఏర్పాటు - దుబారాను అరికట్టకపోతే ఖజానాపై భారం**

**హైదరాబాద్ :** సహకార వ్యవస్థలో దగుల్బాజీలు చేరడం వల్ల అది నిర్వీర్యం అవుతోంది. రైతులను ఆదుకుని వారికి అండగా నిలవాల్సిన సహకారరంగం పూర్తిగా కట్టుతప్పింది. సహకార బ్యాంకులు తమ విధానాలను పూర్తిగా తుంగలో తొక్కాయి. నిజానికి గ్రామస్థాయిలో సహకార రంగం బలంగా ఉంటే.. రైతులు బలపడతారు. సహకారరంగంతో పాటు మార్కెట్ వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. తెలంగాణలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసినా అవి కేవలం ఓ రాజకీయ కమిటీలుగా పనిచేసాయి. పదవుల కోసం సృష్టించిన కమిటీలుగా దిష్టిబొమ్మలులగా నిలిచాయి. దీనిని ప్రకటించినప్పుడు ఆనాటి సిఎం సిఎం కెసిఆర్ ఎన్నో ఆదర్శాలు ప్రకటించారు. రైతు సమన్వయ సమితులు ఎక్కడా ఒక్క రైతు సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. మార్కెట్లో రైతులు పడిగాపలు కాసినా, ధరలు రాక అవస్థలు పడ్డా,,ధాన్యం తడిసి నెత్తీనోరు మొత్తుకున్నా దానికి నాటి ఛైర్మన్‌గా, నేడు ఎమ్మెల్యేగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి ఎక్కడా కానరాలేదు. నిజానికి రైతులకు అండగా ఉండాల్సిన సమన్వయ సమితులు ఉత్సవ విగ్రహాల్లా మారాయి కనుకనే రైతులపై కేంద్రంతో పోరాడుతున్నారు. తెలంగాణకు సంబంధించి రైతువిధానాలు రూపొందించడంలో ఈ సమితి పూర్తిగా విఫలం అయ్యింది. రైతులు తమ బాధులు పడలేక అందరి లాగే తానూ ఏదో పట్నం వెళ్లి పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటానని నిర్ణయించు కుంటే..ప్రజల గతేం కానుందో ఊహించుకోవాలి. వ్యవసాయం పడావు పడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తిగా అవగాహన లేకపోవడం కూడా మనకు ప్రమాదమే... అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం.. పెట్టుబడి కోసం బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వడం..ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీలు లేకుండా కొనుగోలు చేయడం.. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారాన్నే పండిస్తారు. అందుకు అవసరమైన వాతావరణం సృష్టించాలి. రైతులకు అలక రాకుండా.. వారు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. రతైఉబంధు పేరుతో దుబారాగ చేయడం కూడా సరికాదు. వ్యవసాయాన్ని పండగ




చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగాలి. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేయాలి. రైతులు నిశ్చింతంగా వ్యవసాయం చేయొచ్చు అన్న భావన కలిగించాలి. గత పదేళ్లలో తీసుకున్న చర్యలు మేలుచేసేవిగా లేవనే చెప్పాలి. పంటల కొనుగోళ్ల సమయంలో రైతులకు ఆందోళన లేకుండా పంటలను అమ్ముకోవడం లేదు. నిశ్చింతంగా మార్కెట్‌కు వచ్చి పంటలను చక్కగా అమ్ముకోగలిగేలా మార్కెట్ విధానాలు అవలంబించాలి. అప్పుడే సంపూర్ణ ప్రోత్సాహం దక్క గలదు. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ము కోలేక పోతున్నారు. ఆర్థికంగా అండగా నిలవాలన్న విధంగా కార్యక్రమాలు చేయాలి. అప్పుడే దేశం కూడా ఆర్థికంగా పుంజుకుంటుంది. ప్రజలకు తక్కువ ధరలో ఆహారధాన్యాలు అందుతాయి. ఎగుమతుల ద్వారా విదేశీమారకం సంపాదించుకోగలుగుతాం. ఆలా చేయనంత కాలం భారత అన్నదాతల తలరాత మారదు. కేవలం రైతుబంధు, ఉచిత విద్యుత్ సరఫరాతో సత్ఫలితాలు రావని గుర్తించడం లేదు. రైతుబంధులోనూ వ్యవసాయం చేయని వారి ఖాతాల్లో నగదు పడిపోతోంది. దీనిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. పోరంబోకు భూములున్న వారికి రైతుబంధు పేరుతో లక్షల్లో జమ చేసారు. దీనిపై సమీక్షించాలి. ఇలా డబ్బు వృధాను అరికట్టాలి. వ్యవసాయం చేస్తున్నారా లేదా.. ఆ భూముల్లో ఏ పంటలు పండుతున్నాయో గుర్తించాలి. ఇలాంటి భూములకు ఉచిత విద్యుత్ ఇస్తూ గృహవినియోగదారులపై ఛార్జీల భారం మోపడం సరికాదు. నీటిసౌకర్యం పెరగడంతో తెలంగాణలో ధాన్యం దిగుబడులు కూడా పెరిగాయి. అయితే ఈ మేరకు కొనుగోళ్లు మాత్రం సాగడం లేదు. చివరి గింజవరకు ధాన్యం కొంటామన్న ప్రకటనకు కట్టుబడి విస్తృత ఏర్పాట్లు చేయాలి. తెలంగాణలో చేపట్టిన రైతుబంధు పథకం ఎంతగా దుర్వినియోగం అయ్యిందో చూశాం. దీనిని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటు. వారికి అందించిన పెట్టుబడి ప్రోత్సాహకం అన్నది వారిలో భరోసా కల్పించేదిగా మాత్రమే ఉండాలి. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు తీసుకొచ్చిన రైతుబంధు పథకం కేవలం ఓట్ల పథకంలా మారింది. చెరువుల పునురుద్దరణ కార్యక్రమాలు డొల్ల అని తేలాయి

# సీసీకెమెరాల ఏర్పాటుతో నేరాల గుర్తింపు

**- పట్టణాల్లో ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహం - పలు పట్టణాల్లో సహకారాం అందిస్తున్న దాతలు**

**హైదరాబాద్ :** శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. 33 జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహి స్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదు.

## విజయవాడ,విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్ లకు రుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్న విదేశీ బ్యాంకులు.



పలు విదేశీ బ్యాంకుల ప్రతినిధులతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి సమావేశం. సమావేశానికి హాజరైన **KFW,AFD, ADB,NDB,AIIB** ,జైకా,ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు. విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయా బ్యాంకుల ప్రతినిధులు. రెండు మెట్రో ప్రాజెక్ట్ లకు అయ్యే వ్యయంలో 12000 కోట్లు రుణం అవసరం అవుతుందని అంచనా. విశాఖ మెట్రోకు 6100 కోట్లు,విజయవాడ మెట్రోకు 5900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయం. తక్కువ వడ్డీకి లోన్ ఇచ్చే బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్న మెట్రో కార్పొరేషన్ ఎండీ.

## లక్డీకపూల్‌లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కాంస్య విగ్రహం



మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన జీహెచ్ఎంసీ లక్డీకపూల్‌లో మెట్రో స్టేషన్ సమీపంలోని చౌరస్తాలో తొమ్మిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం బిడ్‌లు ఆహ్వానిస్తూ టెండర్ నోటిఫికేషన్ ప్రకటన జూలై 4న రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించాలని భావిస్తున్న జీహెచ్ఎంసీ

## పాల్విన్ కాలనీ డివిజన్లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల...



**తెలుగు వెలుగు ప్రతినిధి శేర్లింగంపల్లి**
శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పి జె ఆర్ నగర్ లో రూ. 2 కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులలో భాగంగా స్లాబు నిర్మాణం పూర్తయిందని అన్నారు. స్లాబును మంచిగా క్యూరింగ్ చేయించాలని అధికారులకు తెలియచేసారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్ ను అన్ని హంగుల తో సకల సౌకర్యాల తో నిర్మిస్తామని కార్పొరేటర్ తెలియచేసారు. ఫంక్షన్ హాల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేసారు. ఫంక్షన్ హాల్ లో వివాహాది శు భకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగ పడుతుంది అని అన్నారు. ఫంక్షన్ హాల్ మరియు చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు త్వరలోనే అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, పోశెట్టిగౌడ్, యాదగిరి, అగ్రవాసు, ముజీబ్, మహేష్, రవీందర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లిలో జరిగిన పలు వివాహాలు, శుభకార్యాలలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బుధవారం జరిగిన పలు వివాహ శుభ కార్యాలయంలో పాల్గొన్నారు. కూకట్ పల్లి అశోక్ గార్డెన్స్ లో జరిగిన సిరిగని వారి వివాహ వేడుకలో సిరిగని వీరేశం గౌడ్ ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని లత, చందన్ గౌడ్ వధూవరులను అభినందించి ఆశీర్వదించారు. అలాగే కేజీఆర్ ఫంక్షన్ హాల్ లో మర్రి వారి వివాహ వేడుకల్లో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులైన సుశాంత్ రెడ్డి కృష్ణ లోహితలను అభినందించి ఆశీర్వదించారు. కూకట్పల్లిలోని చిత్తారమ్మ దేవాలయం ఫంక్షన్ హాల్లో జరిగిన పరశురాములు కుమార్తె ఉమామహేశ్వరి, అల్లుడు శ్రీకాంత్ ల పెల్లి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను అభినందించి ఆశీర్వదించారు.

# ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !



అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలువరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతిక ఇఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఎపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబంధు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదేసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదేసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పునకు నాందీప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రయామే వెలిబుచ్చింది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఎపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణెళి. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులయి ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్‌ను మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్‌వి రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ది పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఎపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తేర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య,వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినపుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ డంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యలుగా చేయగల సమర్థులు.

## మసకబారుతున్న సిబిఐ సమర్థత

**కేసులను తేల్చడంలో నిర్లక్ష్యం**

**ఐదేళ్లయినా కొలిక్కిరాని వివేకా హత్యకేసు**

**కడప:** సిబిఐ చేపడుతున్న కేసుల్లో ఎన్ని నిజాలు నిర్ధారణ అయ్యాయో తెలియడం లేదు. ఎన్ని కేసులు బయటకు వచ్చాయో తెలియడం లేదు. ఇటీవలి కాలంలో కొన్ని కేసులు మాత్రం కేవలం బెదిరింపులకే పరిమితం అవుతున్నాయి. లిక్కర్ కేసులో నిజాలు రాబట్టలేకపోయారు. అంతెందుకు ఐదేళ్లయినా వైఎస్ వివేకాను హత్య చేసిన వారెవరో తేల్చలేదు. నిర్ధారించలేదు. సరికదా కేసును కొలిక్కి తీసుకుని రాలేదు. ఈ కేసులో ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న వారంతా అమయకులని సిఎం జగన్,సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. సొంత చిన్నాన్న హత్యకేసును కొలిక్కి తేవాలన్న దక్షత కూడా లేకుండా పోయింది. నిజానికి అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం సిఐడిని ఉపయోగించి అనేకానేక కేసులను తవ్వుతూ..అనుమానం ఉన్నవారినల్లా బొక్కలో తోస్తోంది. కానీ వివేకానంద రెడ్డి హత్య కేసులో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే అందరికీ అనుమానాలు వస్తున్నాయి. సొంత చిన్నాన్న హత్య కేసును ఛేదించలేని చేవ చచ్చిన పాలకుడిగా జగన్ ప్రజల ముందు నిలిచాడు. మానాన్నను చంపినవాళ్లను ఇంకెప్పుడు పట్టుకుంటారని దారుణ హత్యకు గురైన వై.ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అడిగిన సూటి ప్రశ్నకు నేటికీ సమాధానం దొరకలేదు. సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని స్వయంగా ఆమె ఆవేదన వ్యక్తంచేయడం కూడా జగన్ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఈ కేసును హైదరాబాద్‌కు బదలాయించిన తరవాతనే కొంత కదలిక వస్తోంది. అయినా సిబిఐ కూడా దీనిని తేల్చలేక పోయింది. వివేకా హత్యను ఎవరో కానీ చాలా తెలివిగా చేశారని అనిపిస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉంటున్న చిక్కడు దొరకడు ఎవడో సిబిఐ కూడా పట్టుకోలేక పోతున్నది. అంటే పక్కా ప్రణాళికతోనే చేశారని అనుకోవాలి. ఆనవాళ్లు లేకుండా..అనుమానాలు రాకుండా...విచారణలో దొరక్కుండా హత్యను చాలా పక్కగా చేశారని అర్థం అవుతోంది. సిబిఐ కూడా ఈ విషయంలో కూపీలాగ లేకపోతున్నది. మరోవైపు సిబిఐ విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డిని విచారించడం తో వైసిపి ఎందుకనో ఉలిక్కిపడుతోంది. అవినాశ్ రెడ్డి అమాయకుడని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే వివేకాను హత్య చేశారన్న ప్రాథమిక అంచనా అంటూ ప్రచారం సాగుతోంది. ఇది నిజమా కాదా అన్నది సిబిఐ దర్యాప్తులో బట్టబయలు కానుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డిలకు మాత్రం కేసును త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కడా కానరావడం లేదు. పులివెందులలో తమ బంధువులు కాకుండా బయటి వ్యక్తులు వచ్చి హత్య చేసే అవకాశమే లేదని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై తనకు అనుమానం ఉందని డాక్టర్ సునీత.. గతంలోనే చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఎటూ తేల్చకపోవడంతో సిబిఐ పనితీరుపైనా అనుమానాలు పెరుగు తున్నాయి. నిజానికి వివేకా పట్ల గౌరవం ఉండివుంటే ఈ కేసులో సిఎం జగన్ సీరియస్‌గానే స్పందించి ఉండేవారు. డాక్టర్ సునీత ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం చెప్పవలసి వస్తుందనే మౌనంగా ఉంటున్నారా అన్నది కూడా అర్థం కావడం లేదు. కోడికత్తి కేసు కూడా ఇలాగా నీరుగారి పోతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకా హత్య కేసును ఛేదిస్తారని అంతా భావించారు. కానీ నీరుగార్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చేశారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఎందుకంటే చంద్రబాబు హయాంలో హత్య కేసును దర్యాప్తు చేయడానికి నియమితులైన అధికారులను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బదిలీ చేశారు. వారిలో కొందరికి పోస్టింగులు కూడా ఇవ్వలేదు. హత్య కేసును నీరుగారుస్తున్నారన్న అనుమానం రావడంతో వివేకా సతీమణి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకున్నారు. సీబీఐ దర్యాప్తు విషయంలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ దర్యాప్తు అవసరం లేదని ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. దీంతో కేసును త్వరితగతిన ఛేదిస్తారని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది. సొంత బాబాయ్‌ని దారుణంగా చంపినవారిని పట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఆధీనంలోని పోలీస్ శాఖ ఎందుకు విఫలం అయ్యిందనేదానికి సమాధానం లేదు. అలాగే హత్య ఎవరు చేశారో..ఎందుకు చేశారో పక్కన పెడితే జగన్‌కు ఇందులో ఆసక్తి లేకుండా పోయిందన్నది వాస్తవం. అందువల్ల ఆయన ఈ కేసును పెద్దగా పట్టించుకోవడం లేదు. వైఎస్ షర్మిల కూడా విచారణ జరగాలని కోరుకుంటున్నారు. దోషులు పట్టుబడాల్సి ఉందంటున్నారు. కానీ కుటుంబంలో ఎక్కడా వివేకానంద మర్డర్‌పై సీరియస్‌గా మద్దతు దక్కడం లేదు. ఈ హత్య కేసులో సిబిఐ విచారణ ద్వారా నిజాలు వస్తాయని భావించినా..సిబిఐ కూడా తేల్చలేకపోయింది.

# దేశ హితం కోసమే ఉమ్మడి పౌరస్మృతి !

ఉమ్మడి పౌరస్మృతి అనగానే రాజకీయపార్టీలు, మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రజలందరి రక్తం ఒక్కటే అంటున్న కమ్యూనిస్టులు సైతం ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నారు. దురాచారాలను అణచివేసే క్రమంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆవశ్యకతగా గుర్తించాలి. గతంలో ఎన్నో దురాచారాలను మనం రూపు మాపుకున్నాం. బాల్య వివాహాలను రద్దు చేశాం. సతీసహగమనాన్ని రద్దు చేశాం. అలాగే అనేక మార్పులకు ప్రపంచం లోనవు తున్న వేళ ప్రజలకు చట్టం అన్నది ఒకే రకంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మతపరమైన అచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగం పరిధిలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం.ఈ దేశంలో పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవన భృతి లాంటి విషయాలకు సంబంధించి చట్టాలు అందరికీ ఒకేలా లేవు. పౌరులు ఆచరించే మతం, విశ్వాసాల ఆధారంగా వేర్వేరుగా ఉంది. అయితే మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయడమే యూనిఫాం సివిల్ కోడ్. ఈ డిమాండ్ దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చిన నాటి నుంచే ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా ఇదే చెబుతోంది. దేశ పౌరులకు యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. ఇప్పటి వరకు దేశంలో ప్రజాచట్టాలకు భిన్నంగా మతపరమైన చట్టాలున్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. అయితే ఉమ్మడి పౌరస్మృతిలో ఎవరికి వాళ్లుగా అమలు చేసుకునే చట్టాలు చెల్లవు. దాంతో చాలా కాలంగా దేశంలో మైనారిటీ అయిన ముస్లింలు యూనిఫావ్ సివిల్ కోడ్‌ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి అంశంపై చర్చ మొదలయ్యింది. 2019లో ట్రిపుల్ తలాక్‌ని నేరంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. యూనిఫామ్ సివిల్ కోడ్ వచ్చే దాకా దేశంలో లింగ సమానత్వం సాధ్యం కాదనే వాదనలున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి వల్ల దేశంలో సమానత్వం లభిస్తుంది. కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని చెబుతున్న వారంతా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయ ప్రయోజనాలు ఆశించేవారుగానే చూడాలి. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు వీలుంది. దీనిని ఎవరూ కాదనడం లేదు. చట్టం విషయంలోనే మతాల ఆధారంగా ఉండరాదన్నది ఆకాంక్ష. అయితే భిన్న మతాలు, నమ్మకాలున్న భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఉమ్మడి సివిల్ కోడ్స్ ద్వారా అందరినీ ఏకం చేయడమనేది ఎంతో కష్టమైన విషయం అన్న వాదన తెస్తున్నారు కొందరు.

హిందువులైనా, ముస్లింలైనా వాళ్లలో వాళ్లకు అనేక భిన్నమైన నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. అవి వేరు..చట్టాలు వేరని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మిందువుల్లోనూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు పాటించే వాళ్లున్నారు. ముస్లింలలోనూ షరియా చట్టాలను పాటించని వాళ్లున్నారు. బోరా ముస్లింలు ఆస్తుల వారసత్వం విషయంలో హిందువుల చట్టాలను అనుసరిస్తుంటారు. ఆస్తుల వారసత్వం విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చట్టాలున్నాయి. ఇక క్రైస్త్రవులు మెజారిటీగా ఉండే నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలు తమకంటూ ప్రత్యేకమైన సివిల్ చట్టాలను రూపొందించుకున్నాయి. వాటికి ఆధారం వారి సంప్రదాయాలే గానీ మతం కాదు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉంది. కానీ క్యాథలిక్స్, ఇతర మతస్థులకు భిన్నమైన నియమాలున్నాయి. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లకు వారసత్వ ఆస్తిలో వాటా పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీని కంటే ముందే పలు రాష్ట్రాలు మహిళలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. ఇలా రాష్ట్రానికో చట్టం, మతానికో చట్టం,ప్రాంతానికో చట్టం ఉండడం వల్ల గందరగోళంగా ఉంది. దీనిని తొలగిస్తే తప్ప దేశంలో ఏకీకరణ సాధ్యం కాదు. ప్రజల్లో ఐక్యత రాదు. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా మిగతా మైనారిటీ వర్గాలు చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందకంటే మతం ఆధారంగా చట్టాలు చేస్తూ పోతే ఇప్పటికే దేశం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజింపబడింది. మతం లాంటి వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని ప్రభుత్వం కూడా భావించడం లేదు. గడిచిన 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా దేశ సమైక్యత కోసం యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకు రావాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. డెబ్బయి అయిదేండ్ల స్వాతంత్ర్యంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! స్త్రీలను ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నారు. వారికి గౌరవం దక్కడం లేదు. ఉండటానికి కూడు, గుడ్డ, నీడ సమకూర్చనేలేదు. ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదన్న ప్రచారం వాడుకలోకి తెచ్చారు. కానీ ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికీ అన్ని హక్కులనూ కల్పిస్తున్నది. అలాంటప్పుడు చట్టాలు అందరికీ ఒకేలా కాకుండా కొందరికి మరోలా ఉండడం వల్ల సమాజంలో అసమానతలు ప్రబలుతాయి. మీ చట్టం మాకు చెల్లదని ధిక్కరించే సంస్కృతి వస్తుంది. దీనిని అధిగమించి ప్రజలంతా ఒక్కటే..అందరికీ ఒకటే చట్టం అన్న భావన ఉంటే సమానభావం అలవడుతుంది. అందుకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమే.

## స్థూలకాయంతో గుండెపై ప్రభావం

**ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సిందే**



**న్యూఢిల్లీ :** స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి.శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లువ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

## వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

**జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యారోగ్యశాఖ**



**విశాఖపట్టణం:** యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

## కోతుల బెడదతో ప్రజల ఆందోళన

**వరంగల్:** కోతుల బెడద నివారించేందుకు అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాలని, కోతులను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు పట్టేవారిని ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పిస్తే గ్రామాల్లో బెడద ఉండదని అంటున్నారు. అలాగే పంటపొలాలకు కూడా నష్టం ఉండదని అంటున్నారు. అయితే కోతులకు అడవుల్లో ఆవాలసాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి గ్రామాల్లో కోతులకు ఆవాసం లేకుండా చేయాలి. అడవుల్లో నేరేడు, సీతాఫలం, వెలగ, రేగు, మారేడు వంటి పండ్ల మొక్కలు నాటాలనిని చెప్పారు. ఇదిలావుంటే అడవుల్లో కోతులకు అనుకూల వాతావరణం కల్పించి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అంటున్నారు. ఏరియాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచుతున్నట్లు గతంలో చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే అవేవీ సాధ్యం కాలేదు. ఇదంతా ప్రచారానికి పరిమితం అయ్యింది. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు పని చేస్తున్నాయని, అటవీ నర్సరీలు ఉన్న గ్రామ పంచాయతీలు మినహాయించి మిగతా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క నర్సరీకి జనాభా, ఇళ్ల సంఖ్య ఆధారంగా 25 వేల నుంచి లక్ష మొక్కలు పెంపకానికి లక్ష్యాలను నిర్దేశిరచినట్లు వివరించారు. అటవీ శాఖకు 40 లక్షలు, గ్రామ పంచాయితీల నుంచి 98 లక్షలు చొప్పన హరితహారం కార్యక్రమానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల్లో 25 శాతం అటవీ పండ్ల మొక్కల పెంపకాన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకంలో భాగంగా హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కానీ కోతుల బెడద నివారణకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.



# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

**దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి**

**మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి**

**న్యూఢిల్లీ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోదీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణులతో పాటు రాజకీయనేతలతో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోదీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోదీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడిన రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు ఇప్పటికైనా స్పందించాలి. మోదీ విధానాలకు తందానా అనకుండా అంతర్గత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్టానికి చేరింది. సమస్యలపై గొంతువిచుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోదీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోదీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఉరకబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పలు చెప్పే ప్రధాని మోదీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగీ చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. నల్లధనాన్ని తవ్వితీయ డమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించి పన్నులను హేతుబద్దీ కరించాలి. పోపుల డబ్బాలో కూడబెట్టుకున్న దానికి సైతం జిఎస్టీ కట్టే దాపురించింది. అధికారం లోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాలు సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదు. ఈ క్రమంలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది.

## తిరుమలలో విఐపిలకే ప్రాధాన్యం

**సామాన్యులకు దక్కని దర్శనభాగ్యం**

**తిరుమల :** తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లో నిండి బయటకు క్యూలు కడుతున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. విఐపిలు పదేపదే రావడంతో వారికోసం దర్శనాలను నిలిపివేస్తున్నారు. వారి రాకను నియంత్రిస్తామన్న హామీ నెరవేరడం లేదు.తిరుమల శ్రీవారిని సామాన్యులు మాత్రమే దర్శించుకునేలా ఆంక్షలు విధించాలని భక్తులుకోరుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లోనూ విఐపిలు రావడం వల్ల తీవ్రఇబ్బందులు కలుగుతున్నాయని, సామాన్యులకు దర్శనం కలగడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తులు తమ ఆపదల మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని అలాంటి సమయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అయినా దేవుడికి భక్తుడికి మధ్య అధికారుల పెత్తనం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమలలో ముందు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా విఐపిలను నియంత్రించాలని అన్నారు. ఆ నిబంధనేదో ముందు ప్రజాప్రతినిధులకు విధించాలని అంటున్నారు. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు. ప్రశాంతతకు మారుపేరు తిరుమల.. అయితే పెత్తనం చెలాయించాలను కోవడం సరికాదు. ఇకపోతే ఇటీవల ఇక్కడ అన్యమత ప్రచారాలు, మద్యం, మాంసం తదితర విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గవర్నర్ వ్యవస్థ రద్దు కోసం పోరాడాలి !

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ఇటీవల అనేక చారిత్రక తీర్పులను వెలువరిస్తోంది. అనేక విషయాల్లో మార్గనిరద్దేశనం చేస్తోంది. ఇవన్నీ కూడా పాలకులకు కనువిప్పు కావాలి. రాజకీయ నాయకులపై కేసులు కావచ్చు..వారి ఆస్తులు కావచ్చు..గవర్నర్ వ్యవస్థ కావచ్చు..ఇలా అనేక త చారిత్రక తీర్పులు వస్తున్నాయి. ఇకపోతే గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిది. దానితో ఆడుకోవడం రాజకీయ నాయకులకు అవసరం. అందుకే గవర్నర్ వ్యవస్థను ఎత్తేయలేకపోతున్నారు. దేశంలో ఈ వ్యవస్థ వల్ల ఏటా వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. రాజకీయ పాచికలు ఆడేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఉపయోగించు కుంటోంది తప్ప ప్రజలకు నేరుగా ఉపయోగం లేదు. అంతేకుండా రాష్టాల్లో అనవసర అధికార కేంద్రంగా మారింది. దీనిని ఎత్తేయాలని ఎన్టీఆర్ సహా అందరూ డిమాండ్ చేసినవారే. కానీ వినేదెవ్వరు... వినిపించే దెవ్వరు అన్న చందంగా ఇప్పుడు పరిస్థితి తయారయ్యింది. గవర్నర్ పోస్టు లేకుండా ప్రభుత్వం నడుస్తుంది. కానీ దీనివల్ల ఉపయోగం లేదని తెలిసినా కొనసాగిస్తున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఉపయోగిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్, ఉన్నా, ఇప్పుడు బిజెపి ఉన్నా ఒరిగిందేమీ లేదు. అందుకే దివంగత ఎన్టీఆర్ దీని రద్దు కోసం ఆనాడు గట్టిగానే డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు కూడా ఇవే డిమాండ్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిజెపిలు మాత్రం రోరు మెదపడం లేదు. ఇటీవల తమిళనాడు వ్యవహారం తీసుకుంటే ఎంత రచ్చయ్యిందో చూశాం. గతంలో బెంగాల్లోనూ, కేరలలోనూ ఇదే తరహా రాజకీయాలు నడిపారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళిసై సైతం ఇదే తరహాలో వ్యవహరించింది.కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ తాబేదార్లు గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోంది. కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్పింది. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇటీవల సుప్రీంతో చివాట్లు తిన్నారు. అంతేగాకుండా ఆయన ప్రమేయం లేకుండానే బిల్లులను పాస్ చేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అనేక చారిత్రాత్మక తీర్పులను వెలువరిస్తున్న సుప్రీంకోర్టు...మరో చారిత్రాత్మక తీర్పుతో తమిళనాడు గవర్నర్ చెంపచెల్లుమనిపించింది. గవర్నర్ల మితిమీరిన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు...బిజెపి కాంగ్రెస్‌లకు కనువిప్పుకావాలి. కాంగ్రెస్ కాలం నుంచే గవర్నర్ వ్యవస్థను రాజకీయపునరావాస కేంద్రాలుగా మార్చుకుంది. బిజెపి కూడా దానిని కొనసాగించింది. తమిళనాడు గవర్నర్ రవి అనుసరించిన తీరుపై సుప్రీం తీర్పు రాజ్యాంగ వ్యవస్థను బలోపేతం చేసేదిగా ఈ తీర్పు... సహజంగానే డిఎంకె ప్రభుత్వానికి భారీ విజయంగా చూడాలి.. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఫెడరలిజం బలోపేతానికి జరుగుతున్న పోరాటానికొక ఊతం. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకో రక్షణ కవచం. ఈ తీర్పు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమైనది కాదు. మొత్తం భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సంబంధించినది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు సూటిగా ఉంది. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. అంతేకాదు గవర్నర్లు ఎంతో ఉండాలో నిర్దేశించింది. నెలలోగా బిల్లులను ఆమోదించాలని చెప్పింది. లేకుంటే అవి బిల్లులగా మారుతాయని తేల్చింది. ఈ తీర్పు ఎలాంటి అనుమానాలు లేకుండా చాలా స్పష్టంగా వుంది. గవర్నర్లంటే... కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసే దుస్సంప్రదాయానికి ఈ తీర్పు చెల్లుచీటీ రాసింది. బిజెపి ఎక్కడా ఈ తీర్పుపై మాట్లాడ లేదు. రాజ్యాంగానికి దెబ్బపడకుండా చూస్తామని చెప్పలేదు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తాజాగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కిపెట్టిన గవర్నర్ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. 'కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే తొక్కిపెట్టి , ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షం' అని అభివర్ణించింది. తమిళనాడు గవర్నర్ రవి తన నియామకం జరిగిన నాటినుంచీ ఇలాగే వ్యయహరించారు. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశిరచింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకున్న చర్యలన్నీ రద్దవుతా యని, అసెంబ్లీ... గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీ నుంచి ఈ బిల్లులన్నీ ఆమోదం పొందినట్లు- పరిగణించాలని సుప్రీం స్పష్టం చేసింది. అంతేకాదు, గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు తప్పుబట్టింది. ప్రజలచే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వీరికి ఇవ్వలేదని కోర్టు పునరుద్ఘాటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావసరాలు, సంక్షేమం కోసం చట్టాలను రూపొందిస్తాయి. వాటిని నిరోధించే వైఖరి రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడటం గవర్నర్ పని కాదని ఎత్తిచూపుతూ...గవర్నర్ రవి అడ్డుకున్న పది బిల్లులను సుప్రీం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సమర్థించే ఈ తీర్పు...అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఒక హెచ్చరిక. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు చెంపపెట్టు లాంటిదని కడా చెప్పకతప్పదు. అంబేద్కర్ యంతికి ముందు వచ్చిన ఈ తీర్పు రాజ్యాంగాన్ని కాలరాస్తున్న వారికి కనువిప్పుకావాలి. ఈ సందర్భంగా ఉటంకించిన సుప్రీంకోర్టు పాలకులకు గట్టిగానే చురకలు వేసింది. ఈ క్రమంలో వచ్చిన ఈ తీర్పుతో...అస్పష్టతకు తెరపడింది. బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదని చేసే వాదనలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. ఈ తీర్పుతో అయినా గవర్నర్ వ్యవస్థ పనిలేదని గుర్తించాలి. దీనిని రద్దు చేసేందుకు అంతా ఉద్యమించాలి.


# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !



**న్యూఢిల్లీ :** అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహతంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శతృవులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ర్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్త్‌లను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చు కోవాలి. ఇటీవల ఆక్వా ఎగగుమతులపై ట్రంప్ ప్రభావం పడింది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపతేం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు. చైనా తరహాలో కఠినంగా సాగితేనే ఇది సాధ్యమని గుర్తించాలి.

# నినాదంగానే మిగిలిపోతున్న అభివృద్ధి !





**హైద్రాబాద్ :** విపక్షంలో ఉన్నప్పుడు కనిపించిన అనేకానేకసమస్యలను... అధికారంలో ఉన్నప్పుడు విస్మరిస్తున్నారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులు తదితర సమస్యలు అధికారంలోకి వచ్చాక వారికి కనిపించడం లేదు. ఇందుకు మోడీ కూడా మినహాయింపు కాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ అనేక రకాలుగా యూపిఎ ప్రభుత్వాన్ని విమర్శించి, మన్మోమన్ సింగ్‌ను మౌనసింగ్‌గా అభివర్ణించిన మోడీ ఇప్పుడు ప్రధాన సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పదేళ్ల పుణ్యకాలం గడిచిపోయింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుకున్నాం. ఇంకా రైతులు, నిరుద్యోగుల సమస్యలు రెట్టింపు అయ్యాయే తప్ప తగ్గలేదు. మన నాయకులు కూడా నైతికంగా పతనమవుతూ వచ్చారు. అధికారమే పరమావధిగా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అధికారం కోసం సమాజాన్ని కులాలు, మతాల పేరిట ముక్కలు చెక్కలు చేశారు. తప్పుడు పనులు చేసే వారు కూడా కులాన్ని రక్షణ కవచంగా వాడుకోవడం మొదలెట్టారు. వజ్రోత్సవాల సందర్భంగా మన పతనాన్ని చూస్తే ఆవేదనే మిగులుతుంది. ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చించడం లేదు. అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించడం లేదు. మోడీ పార్లమెంటులో కనిపించరు. ప్రజల్లోకి రారు. ప్రజలు తమస సమ్యలను ఎక్కడ చెప్పుకోవాలో తెలియడం లేదు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలను ఆరా తీయడం లేదు. ఇలాగే పాలన కొనసాగిస్తే మరో 20 ఏళ్లయినా భారత్ బలపడదు. అత్యాచార ఘటనలు, పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. పన్నలు వసూళ్లతో ప్రజలను పీల్చి పిప్పి చేయడం తప్ప మరో ధ్యాస బిజెపి పాలకులకు కనిపించడం లేదు. ఈ దశలో భారతదేశం స్వాతంత్ర్యోత్సవాలను పురస్కరించుకుని 78 ఏళ్ళు అవుతున్న సందర్భంగా దేశ విదేశాల్లోనూ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఊరూవాడా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. ప్రజలు తమ దేశభక్తిని మనసారా చాటారు. ఈ స్ఫూర్తిని ఇంకా ముందుకు తీసుకుని పోవాలని ప్రజలు మాత్రమే సంకల్పం ప్రకటించారు. పాలకులు ఇక తమ రాజకీయాలను పక్కన పెట్టి దేశంకోసం శ్రమించాల్సిన సమయమిది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక, ఆర్థిక న్యాయానికి విలువనిచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు స్వార్థపర రాజకీయశక్తులతో పోరాడేందుకు సమైక్యంగా కృషి చేయాలి. అప్పుడేపోరాట యోధులు సాధించి పెట్టిన స్వాతంత్ర్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళ గలుగుతాం. ఆధునిక కాలంలో ఒక స్వతంత్ర దేశం సాధించిన పురోగతిని అంచనా వేయడానికి 78 ఏళ్ల సుదీర్ఘ కాలం సరిగ్గా సరిపోతుంది. మనం సంబరంగా జరుపుకుంటున్న ఈ ఉత్సవాలను పునఃసమీక్షించు కుని ముందుకు సాగాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా ఇంకా దారిద్ర్యం పోలేదు. పేదలు పేదలుగా ఉంటున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాం. ఆర్థికంగా కూడా పురోగమించాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశ వార్షిక బడ్జెట్ 250 కోట్లు దాటలేదు. ఇందులో దాదాపు 30 కోట్ల ద్రవ్యలోటు ఉంది. ఇప్పుడు దేశ వార్షిక బడ్జెట్ దాదాపు 30 లక్షల కోట్ల వరకు ఉంది. వార్షిక ఆదాయం 170 కోట్ల వరకు మాత్రమే ఉన్నప్పటికీ నాటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా వాటిని పూర్తి చేశారు. ఇప్పుడు ప్రభుత్వ ఆదాయం ఇబ్బడిముబ్బడి గా పెరిగినప్పటికీ దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుం టున్నాం. ఉపాధి ఉద్యోగ రంగాలను దెబ్బతీస్తున్నాం. దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని చెప్పుకొంటున్న పాలకులే పేదరికం పేరిట ఉచిత పథకాలకు తెర తీస్తున్నారు. మరోవైపు లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలను మాఫీ చేస్తున్నాం. ప్పుడు రాష్ట్రాల్లో గానీ, కేంద్రంలో గానీ అధికారంలో ఉన్నవారెవరూ 1947కి ముందు పుట్టినవాళ్లు కారు. ప్రజా జీవితంలో ఉన్నత ప్రమాణాలు అంటే ఎలా ఉంటాయో చెప్పేవారు కూడా లేరు. ఎవరైనా చెప్పడానికి ప్రయత్నించినా ఎగతాళికి గురవుతున్నారు. అత్యంత దుర్భరమైన దారిద్ర్యం నెలకొన్న, వ్యాధులతో కునారిల్లుతున్న, నిరక్షరాస్యులైన ప్రజలతో నిండిన ఒక దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించాలని భారతదేశంలో అధికారంలోకి వచ్చిన కొత్త పాలక వర్గాలు భావించాయి. రెండు శతాబ్దాల పాటు సాగిన వలస పాలనతో దేశం మొత్తంగా కుంగుబాటుకు గురైంది. అభివృద్ధి వెనుకపట్టు పట్టింది. స్వాతంత్ర్యానికి ముందు అర్ధ శతాబ్దంలో వ్యవసాయ జనాభా తలసరి ఆదాయం పూర్తిగా క్షీణించింది. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం స్వతంత్ర భారతదేశం సాధించిన ముఖ్యమైన విజయం. నయా ఉదారవాద విధానాలకు మారడంతో, మూడు దశాబ్దాల క్రితం వరుసగా వచ్చిన ప్రభుత్వాలు సంపన్నులను మరింత సంపన్నులుగా తయారు చేసే అభివృద్ధి పంథాను పెంచి పోషిస్తూ వచ్చాయి. బూర్జువా సంస్థలకు, వారితో కుమ్మక్కైన – అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడి దారులకు అనుకూలంగా లొంగి వుండేటు వంటి విధానాల రూపకల్పన పెరుగుతూ వచ్చింది. మోడీ ప్రభుత్వం కూడా గత ఎనిమిదేళ్ళ కాలంలో నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేసింది. దీనివల్ల పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయి. ప్రజారోగ్య వ్యవస్థ, ప్రభుత్వ విద్యా వ్యవస్థల్లో అభివృద్ధి, విస్తరణకు సంబంధించి వైఫల్యం నెలకొంది. ఇన్నేళ్ల తర్వాత కూడా, ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చు జిడిపిలో కేవలం ఒకే ఒక్క శాతంగా వుంది. ప్రపంచంలోనే చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా రూపాయి పతనాన్ని అడ్డుకోలేక పోతున్నాం. ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం సఫలీకృతం కాలేదంటూ రాజ్యాంగం తుది ముసాయి దాను ఆమోదించిన సమయంలోనే 1949లో రాజ్యాంగనిర్మాయక అసెంబ్లీలో డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. బడా కార్పొరేట్ సొమ్ము రాజకీయ వ్యవస్థను కాలుష్యం చేస్తోంది. రాజ్యాంగం లో పొందు పరచబడిన విలువలు అన్నీ కూడా తీవ్ర దిగ్బంధాన్ని ఎదుర్కొం టున్నాయి. మరింత మెరుగైన జీవితం కావాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదు. బతకడమే భారంగా మారేలా విధానాలు ఉన్నాయి. మెరుగైన పాలన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు సమైక్యంగా వుండేందుకు ప్రయత్నాలు చేయాలి. అప్పుడే స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళగలుగుతాం. దేశాన్ని వేగంగా ముందుకు తీసుకుని వెళ్లగలం. కార్పోరేట్లకు దోచిపెట్టే దేశ సంపదను అడ్డుకోవాల్సిందే. అప్పుడే ప్రజలకు ఈ దేశ ఆస్తులపై హక్కు లభిస్తుంది. అందరికీ ఆహారం, కూడు, గుడ్డా, నివాసం వంటి లక్ష్యాలను చేరుకోవాలి. ఉద్యోగం లేదా ఉపాధి అన్నది హక్కుగా రావాలి. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బును దుబారా చేయకుండా నిరోధించాలి. పాలకులు తమ జేబులోంచి ఇస్తున్నట్లుగా చేస్తున్న పందేరాలకు అడ్డుకట్ట వేయాలి. అభివృద్ధి పనులకే సొమ్మును వినియోగించాలి. అప్పుడే దేశ మనుగడ సాగిస్తుంది.

# నియంతృత్వంపై తిరుగుబాటు !

**హైద్రాబాద్ :** శ్రీలంక తరవాత బంగ్లాదేశ్..ఈ రెండు దేశాలు ప్రపంచానికి ఓ పాఠం చెప్పాయి. నేతల నియంతృత్వ ధోరణలు..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని తీరును ప్రపంచానికి తెలియచేశాయి. చరిత్ర తిరగేస్తే..నియంతలకు స్థానం లేదని ఎప్పుడూ నిరూపిస్తూనే ఉంది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా నియతృత్వ పోకడలు ఆమెనే గద్దె దించాయి. దేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న వారికి రిజర్వేషన్ల పేరుతో తన పార్టీ వారికి లబ్ధి చేకూర్చే విధంగా చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించకుండా మొండిగా, నిరంకుశంగా నిర్ణయాలు తీసుకున్నారు. బంగ్లా సుప్రీంకోర్టు రిజర్వేషన్ల కోటాను తగ్గించినా ప్రజల్లో ఆగ్రహం చల్లారలేదు. దీనికితోడు నేతు విలాసాలకు అలవాటు పడుతున్నా రు. ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఇది ప్రజల్లో ఆగ్రహానికి కారణం అవుతోంది. అదే బంగ్లాదేశ్‌లో తిరుగు బాటుకు బీజం వేసింది. గత కొన్ని వారాలుగా బంగ్లాదేశ్‌లో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పొరుగుదేశాలు, స్నేహితులు గమనిస్తున్నారు. బంగ్లాదేశ్ ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసన షేక్ హసీనా గతంలో సంక్షోభాలను ఎదుర్కొన్నట్లుగానే ఈ సమస్యను కూడా పరిష్కరించగలరా అని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఎందుకంటే పరిస్థితులు దిగజారుతున్నా పట్టించుకోకుండా ముందుకు వెళ్లారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బతుకుజీవుడా అంటే దేశం విడిచి పెట్టా పారిపోవాల్సి వచ్చింది. గతంలో శ్రీలంక ప్రధాని కూడా ఇలాగే పారిపోయారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతమైన, విశ్వసనీయమైన ఎన్నికల ద్వారా 2009లో షేకహేసీనా అధికారం చేపట్టారు. అయితే ఆ తర్వాత 2014, 2018 మరియు 2024లో ఎన్నికలు వివాదాస్పద మైనప్పటికీ.. అధికారాన్ని చేపట్టారు. తన తండ్రి షేక్ ముజీబ్ర్ రహమాన్ ప్రతిష్టను అడ్డం పెట్టుకుని ఆమె రాజ్యమేలారు. అయితే దేశంలో అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. 15 ఏళ్ల సుదీర్ఘపాలనను ముగిస్తూ సోమవారం ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో కోటాను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రారంభమైన విద్యార్థుల నిరసనలు వేగంగా దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి. స్వదేశంలో విదేశాలలో షేక్ హసీనా సాధించిన ఆర్థికాభి వృద్ధిని కప్పిపుచ్చుతూ, ఆమె నిరంకుశత్వం, అవినీతి, బంధుప్రీతిపై అంసతృప్తిని బహిర్గతం చేశాయి. ఓవైపు దేశంలో ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను హరించివేస్తూ, మరోవైపు ఆర్థిక పురోగతి సాధించినంత మాత్రాన ఆ నేత ప్రజాదరణను పొందలేరని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రిజర్వేషన్ల కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనలు, వివాదాస్పద రాజకీయ పరిణామాలుగా మారాయి. అయితే ఈ నిరసనలను అణచివేసేందుకు ఆమె సైన్యాన్ని రంగంలోకి దింపారు. దీనిపై ప్రజాగ్రహం పెల్లుబికింది. కర్ఫ్యూ, షూట్ ఎట్ సైట్ ఆదేశాలు, ఇంటర్నెట్‌పై నిషేధం ఉద్యమాలను మరింత ఉధృతం చేశాయి. ప్రదర్శనకారులను 'రజాకార్లు' అని హసీనా పేర్కొనడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ ఉద్యమాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, సామాజిక సంస్థలు సహా సమాజం లోని విభిన్న వర్గాలు మద్దతు ప్ర కటించాయి. తమ డిమాండ్ల నెరవేరేంతవరకు ప్రధానితో చర్చలకు విద్యార్థులు నిరాకరించారు. ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను తుంగలో తొక్కి కేవలం ఆర్థికాభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చే నేతలకు షేక్ హసీనా పతనం ఉదాహరణగా నిలిచింది. ఆమె తండ్రి జైలు శిక్ష అనుభవించినప్పటికీ దేశం విడిచి పారిపోలేదు. హసీనా నిష్క్రమణ బంగ్లాదేశ్ రాజకీయాల్లో గణనీయమైన మార్పును సూచిస్తుంది. హసీనా తన పదవికాలంలో లిఖించదగిన ఆర్థికాభివృద్ధి ని సాధించారు. ప్రపంచం లోనే అత్యంత పేదరిక దేశంగా ఉన్న బంగ్లాదేశ్ ..ఆమె హయాంలో ఆ ప్రాంతంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ గా రూపాంతరం చెందింది. పొరుగునే ఉన్న భారతదేశాన్ని కూడా అధిగమిం చింది. దశాబ్ద కాలంలో దేశ తలసరి ఆదాయం మూడింతలైంది. గడిచిన 20 ఏళ్లలో దేశంలో 25 మిలియన్లకు పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. హసీనా ప్రభుత్వం దేశీయ నిధులు, రుణాలు అభివృద్ధి నిధుల సాయంతో గంగానదిపై 2.9 బిలియన్ డాలర్ల పద్మ వంతెనవంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టారు. అయితే ఈ ఆర్థికాభివృద్ధి గణనీమైన ఖర్చుతో కూడుకుంది. దీంతో 2014, 2018 మరియు 2024లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు తక్కువ ఓటింగ్, హింస, ప్రతిపక్ష పార్టీల బహిష్కరణల మధ్య జరిగాయి. భయం,అణచివేత వాతావరణాన్ని సృష్టించి, నియంత్రణను కొనసాగించడానికి హసీనా ప్రభుత్వం పూర్తి సైన్యాన్ని వినియోగించింది. 2018లో అమలు చేసిన డిజిటల్ భద్రతా చట్టం విమర్శకుల గొంతుకను అణిచివేసేందుకు, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వానికి, అధికార పార్టీ కార్యకర్తలకు



శక్తివంతమైన ఆయుధంగా మారింది. పత్రికా స్వేచ్ఛ దెబ్బతినింది. హసీనా తన అధికార స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పౌర హక్కులు, క్రమపద్ధతిలో అణచివేసారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ప్రజలమధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. బ్యాంకు మోసాలు పెరిగాయి. రుణ ఎగవేతదారుల జాబితా పెరిగింది. సిఎల్‌సి పవర్, వెస్టర్న్ మెరైన్ షిప్‌యార్డ్ రెమెక్స్ ఫుట్‌వేర్ వంటి కంపెనీలు దివాలతీసిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. 965 కోట్ల నుండి 1,649 కోట్ల బంగ్లాదేశ్ టాకాల వరకు మొండి బకాయిలు పెరిగాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రబలమైన అవినీతి, మొత్తం ఆర్థిక పురోగతి ఉన్నప్పటికీ ప్రజల్లో అసంతృప్తికి ఆజ్యం పోసింది. నియంతలకు ఇది గుణపాఠం కావాలి. ఒంటెద్దు పోకడలతో తీసుకునే నిర్ణయాలు ఎప్పటికైనా ప్రజల్లో తిరుగుబాటుకు కారణమవుతాయి. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాదని తీసుకునే నిర్ణయాలు నిలబడవనడానికి బంగ్లాదేశం ప్రత్యక్ష ఉదాహరణ.

# నిగ్రహం కోల్పోతున్న నేతలు !

**హైద్రాబాద్ :** విగ్రహాల సంగతి ఎలా ఉన్నా..నేతలకు నిగ్రహం ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అంతా అనుకుంటారు. కానీ అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో తప్పులు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగత వాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా..ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుషపదజాలంతో ఎవరైనా దూషిస్తే..మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. మొన్నటి ఎన్నికల సమయంలో ఎపి సిఎంగా ఉన్న జగన్, ఆయన అనుచరులు కూడా బూతులు మాట్లాడారు. తాము పదవుల్లో ఉన్నామన్న జ్ఞానం లేకుండా మాట్లాడారు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల గొడవ నడుస్తోంది. గతంలో కూడా ఇలాంటిదే నడిచింది. పాలకులకు విగ్రహాల మీద ఉన్న శ్రద్ధ.. ప్రజల సమస్యలపైన లేదు. తెలంగాణ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు. వాటిపైన దృష్టిని కాస్తా ఇప్పుడు విగ్రహాల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాటల తూటాలు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం వ్యవహారం ఇప్పుడు దుమారానికి కారణమయ్యింది. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలను కున్నామని బిఆర్ఎస్ వాదిస్తోంది. కానీ అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. నిజానికి తెలంగాణ కోసం పోరాడిన, అమరులైన వారు ఎందరో ఉన్నారు. వారెవ్వరూ విగ్రహాలు పెట్టించుకునేంత స్థాయికి రాలేదు. ఎందుకంటే నేతలు వారి త్యాగాలను గుర్తించిన సందర్భాలు లేవు. కనీసం ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారిని కూడా గుర్తించలేదు. ఇదే సందర్భంలో ఇప్పుడు రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం లేదు. అయితే స్వామి భక్తి చాటుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఉంటుంది. విగ్రహాలు పెట్టడం లేదా పథకాలకు పేర్లు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పెద్దలను ఎప్పుడూ కొలిచే పద్ధతి ఒకటి ఉంది. కాంగ్రెస్‌లో ఇలాంటి పనులు చేస్తుండాలి. లేకపోతే అధిష్ఠానం కోపానికి గురికాక తప్పదు. కాంగ్రెస్‌లో నెహ్రూ వారసులను స్మరిస్తూ పోవాలి. రేవంత్ రెడ్డి కూడా ఇలా చేయాల్సిందే. చేయకుండా ఉండలేరు కూడా. అందుకే తెరపైకి రాజీవ్ విగ్రహం వచ్చి చేరింది. గతంలో వైఎస్ కూడా ఇలాగే చేశారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఎపిలో రాజధానిగా ఉన్న హైదరాద్ నెక్లెస్ రోడ్డును అందంగా తీర్చి దిద్దారు. పార్కులు కట్టారు. ఇలా ప్రసాద్ ఐమాక్స్ పక్కన చక్కని సర్కిల్ ఏర్పాటు చేసి, పూలవనంగా తీర్చి దిద్దారు. వైఎస్ సిఎం అయ్యాక అక్కడ ఇందిరాగాంధీ విగ్రహం పెట్టారు. ఇప్పుడు అక్కడ ఆ విగ్రహం ఉంది. విమానాశ్రయానికి రాజీవ్ పేరు పెట్టారు. క్రికెట్ స్టేడియానికి కూడా రాజీవ్ పేరు పెట్టారు. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే స్వామిభక్తి చాటుకునేందుకు ఇలాంటి పనులన్నీ చేస్తూ పోవాలి. ఈ క్రమంలోనే ఇప్పుడు రేవంత్ వంతు వచ్చింది. అందుకే సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం పెట్టాలని తనవంతుగా భక్తిని చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ నిర్ణయాన్ని సహజంగానే బిఆర్ఎస్ వ్యతిరేకించింది. తాము మళ్లీ అధికారంలోకి రాగానే విగ్రహాన్ని తొలగిస్తామని, రాజీవ్ పేరు ఉన్న విమానాశ్రయానికి లోకల్ లీడర్ల పేరు పెడతామని కెటిఆర్ ఘాటుగానే హెచ్చరించారు. రాజీవ్‌కు తెలంగాణకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రాజీవ్ జయంతి సభ వేడుకగా ఘాటు విమర్శలు చేశారు. రాజీవ్ విగ్రహం పెడితే తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారు, 'చేతనైతే ఆ విగ్రహాన్ని టచ్ చేయండి.. అంతు చూస్తాం' అని సిఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. అధికారం పోయినా బిఆర్ఎస్ నాయకుల్లో కొందరికి అహంకారం తగ్గడం లేదని కూడా మండిపడ్డారు. పనిలోపనిగా సచివాలయం ఎదుట కెసిఆర్ విగ్రహాన్ని పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని కూడా బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో ఏనాడూ విగ్రహం పెట్టాలన్న ఆలోచన రాని వాళ్లకు ఈరోజు రాజీవ్ విగ్రహాన్ని పెడితే ప్రశ్నించే నైతిక హక్కు లేదని అన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం కూడా పెడతామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఈ విగ్రహాన్ని సచివాలయం లోపలే పెడతామని కూడా స్పష్టం చేశారు. రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తాం అంటూ..కొంచెం పరుష పదజాలంతోనే విమర్శలు చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం సామాజిక బహిష్కరణ చేస్తుందని హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ప్రారంభించాలని ముందుగా నిర్ణయం తీసుకున్నా మని, కానీ, ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటం మూలంగా దానిని వాయిదా వేసుకున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహం అమరవీరుల జ్యోతి పక్కన ఉండటం సముచితం అనికూడా సమర్థించుకున్నారు. అలాగే రాజీవ్ దేశానికి చేసిన సేవల గురించి కూడా ప్రస్తావించారు. చివాలయం ముందు దొంగలకు, తాగుబోతులకు స్థానం లేదని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి విమర్శలు కూడా చేశారు. ఇదే సందర్భంలో పలు విమర్శలు కూడా చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి భాష వాడితే తప్పులేదు. కానీ ఇప్పుడు ఇలాంటి భాష అవసరం లేదు. అలాగే రాజీవ్ విగ్రహం కూడా అవసరం లేదు. సచివాలయం ముందు ఇంకెవరిదైనా... లేకపోతే ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారి విగ్రహం పెట్టివుంటే హుందాగా ఉండేది. తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగగా ఉండేది. రాజీవ్‌కు ఇప్పుడు కొత్తగా ఇవ్వాల్సిన గౌరవం ఏమీ లేదు. ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కింది. అదే సందర్భంలో సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డి నిగ్రహంతో ఉండాలి. పరుషంగా మాట్లాడడం వల్ల సిఎం హుందాతనాన్ని కోల్పోతారు. ఇదికూడా గమనించాల్సి ఉంది.

# పాలకుల తీరుపై చైతన్యం కావాలి !

ఒక్కసారి అధికారం చేపడితే మరోమారు దానిని కాపాడుకుని ఓట్లు పొందదమెలా అన్న సూత్రం..అన్నీ రాజకీయ పార్టీలు అవలంబిస్తున్నాయి. ఇందుకు బిజెపి భిన్నంగా ఏమీ లేదు. ప్రాంతీయ పార్టీల తీరులోనే బిజెపి కూడా ఆలోచిస్తోంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి మరోమారు కేంద్రంలో పగ్గాలు దక్కించుకోవాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఎన్‌డిఎలో కొత్త మిత్రులను చేర్చుకోవాలని ఉబలాట పడుతోంది. అలాగే పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమితో గద్దెనెక్కాలని చూస్తోంది సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నా ..కలసివచ్చే ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతోంది. కూటమిలోని ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గి పనిచేస్తోంది. ఇకపోతే గత ఐదేళ్లుగా ఎపిలో చేతికి ఎముకే లేదన్న చందంగా ఖజానాను ఊడ్చిపెట్టిన జగన్ ఇప్పుడు మరోమారు అధికారం కోసం ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. నిజానికి రాష్ట్రం అభివృద్ధి జరిగివుంటే ప్రజలు అడక్కుండానే ఓట్లేస్తారు. కేవలం డబ్బులు పంచడమే పాలన అన్న చందంగా జగన్ పాలన సాగింది. దీంతో ఎపి కూడా అప్పులకుప్పగా మారింది. తెలంగాణలె నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ఊదరగొట్టి ప్రజలను వంచించిన కెసిఆర్‌ను, ఆయన పార్టీని ప్రజలు మొన్నటి ఎన్నికల్లో దించేసారు. ఇప్పుడు ఎంపి ఎన్నికల్లో నాలుగైదు సీట్లు సంపాదిస్తే తప్ప ప్రజలు ఆదరించరు. నాయకులు కలసి ఉండరు. అందుకే కెసిఆర్ ఊతకర్ర పట్టుకుని అడుగులు వేస్తున్నారు. రాజకీయ నాయకుల సరికొత్త రాజకీయాల కారణంగా ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. రాజకీయనేతలు..వారి సమస్యలు ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాజకీయాల్లో కక్షసాధింపు వ్యవహారాలు మిన్నంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అయినా.. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో అయినా కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నాయి. తమ ఆలోచనలకు అనుగుణంగా సాగడం..ప్రజల గురించి పట్టించుకోక పోవడం.. ప్రశ్నించిన వారిని కేసులు పెట్టి వేధించడం పరిపాటిగా మారింది. ఎపిలో అయితే దాడులు, కేసులు, హత్యలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా వివేకానంద కేసులతో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి తండ్రిపై దాడి జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. నేతల్లో నిజాయితీ లోపించిందన్నది నూటికినూరుపాళ్లు నిజం. నిజానికి అవినీతి కావచ్చు, అక్రమాలు కావచ్చు... అందరినీ ఒకే గాటన కట్టే పాలన రావాలి. రాజకీయ లబ్ది కోసం చేసే ప్రయత్నాలను ప్రజలు ఎప్పుడూ హర్షించరని గుర్తించాలి. బెయిల్‌పై ఉన్న జగన్ సిఎం గద్దెనెక్కినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలి. ఇలా అనేకానేక కేసులను పక్కన పెట్టారు. బ్యాంకులను దోచుకున్న వారు ఎందరో దర్జాగా తిరుగుతున్నారు. అందుకే తమైదన రీతిలో పాలనలో రాటుదేలిన పాలకులు ప్రజా ఉద్యమాలకు పెద్దగా జంకడం లేదు. వాటిని కఠినంగా అణచివేసే విధానాలు బాగా వంటబట్టించుకున్నారు. తమ విధానాలతో కార్పోరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే లక్ష్యంతో పాలనా వ్యవహారాలను నడుపుతున్నారు. రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారు. వారికి పనులు అప్పగిం చడం..అందులో లాభాలు పొందడం అలవాటు చేసుకున్నారు. కాళేశ్వరం అవినీతిలో ఇదే జరిగింది. కార్పోరేట్ సంస్థలు విదులుస్తున్న డబ్బులతో అధికారంలోకి రావడ.. వారి కోసం ప్రభుత్వ పరంగా చేయాల్సని పనులు చక్కబెట్టడం రివాజు గా మారింది. ప్రాంతీయ పార్టీలైనా, దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్నానని బీరాలు పలికే బిజెపి అయినా.. కార్పోరేట్లకు దాసోహం అంటోంది. ఎన్నికలకు ముందు ప్రజలను మచ్చిక చేసుకోవడం.. డబ్బులు పంచడం...అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచే పనులు చేయడం దేశంలో అలవాటుగా మారింది. దీనికి ఘనమైన ప్రజాస్వామ్య ముసుగు వేస్తున్నారు. అమరావతి రాజధానిని కొనసాగించాలని రైతులు ఉద్యమిస్తున్నా సిఎం జగన్ పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు భర్తీ చేయండనో లేదా ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణలో చేస్తున్న ఆందోళనలను గులాబీ బాస్ కెసిఆర్ ఖాతరు చేయలేదు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అయినా ఏ ప్రభుత్వం ఉన్నా.. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది ఓ విధానంగా మారింది. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా..తమకు అనుకూల మైన విధానాలను అవలంబిస్తూ ప్రజా సంక్షేమం అన్న ముసుగు కప్పి అధికారం చెలాయిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు అయినా,జాతీయ పార్టీలు అయినా, కమ్యూనిస్టులు అయినా భారతగడ్డపై ప్రజల కోసం పాటుపడే పార్టీలులేవని తేలిపోయింది. మనపాలకులు బ్రిటిషర్ల కన్నా దారుణమైన అణచివేత విధానాలను అలవర్చుకున్నారు. వారి కన్నా కొంచెం కనికరముండేదేమో.. అభివృద్ధి పట్ల వారికున్న చిత్తశుద్ధి నేటి పాలకులకు లేకపోవడం విచారకరం. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలన్న కేందప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలనే సంకల్పం వైసీపీ ప్రభుత్వానికి ఏ కోశాన కూడా లేదు. విశాఖ రైల్వేజోన్ గాలికి పోయింది. ప్రత్యేక హోదా ఊసే లేదు. అయినా ప్రజలకు ఆ స్పృహ కూడా లేదు. ఉన్నా పోరాడే శక్తి లేదు. పోరాడినా పోయేవి ప్రాణాలే తప్ప మరోటి కాదని పాలకులు తేల్చేశారు. ఆందోళనలను పట్టించుకోవడం లేదు. అందుకు అమరావతి, రైతు ఉద్యమం నిదర్శనంగా చూడాలి. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది తెలంగాణలో కెసిఆర్ రాకతో మొదలయ్యిందనే చెప్పాలి. ప్రజాందోళనలు పట్టించుకోకపోవడం, ఖాతరు చేయకపోవడం అన్నది అలవాటుగా చేసుకున్నారు. ఎన్నికలప్పుడు ప్రజలు గొర్రెల్లాగా ఓట్లు వేస్తారని కూడా ప్రగాఢమైన నమ్మకం తో ఉన్నారు. ప్రజల ఆందోళనలతో ప్రభుత్వాలను నిలదీ యడం సాధ్యం కాదని కూడా ప్రజలు గుర్తించా లి. ఓటు వేసే సమయంలో పడ్డ కక్కుర్తి కారణంగా ప్రజలు మోసపోతున్నామని గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. నిజాయితీ కలిగిన నేతలను గుర్తించాలి. అందుకు ఓటర్లు ముందుగా చైతన్యం కావాలి.

# అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

### శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయి ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామినిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

## అప్పులతో ఎంతకాలమీ పాలన !

**న్యూఢిల్లీ :** ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబిరించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖాజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరొటికాదు. ఎన్ని కుటుంబాలకు నగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జ్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారంఏటేటా తగ్గుతోంది.

# ప్రజా సమస్యలపై పోరాడేదెవరు ?



**న్యూఢిల్లీ :** దేశంలో సమస్య ఏదైనా ఉద్యమించాల్సిన అసవరం ఏర్పడింది. ఆయా వర్గాలు తమ అవస్థలను తెలియ చేసేందుకు ఎక్కడిక్కడ ఉద్యమ రూపంలో ప్రభుత్వాలకు తెలియచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక,ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరి స్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్ధానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఇడి కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్ధికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి ఉద్యమం చేయడానికి అడపాదడపా లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా..వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్ధం కావాలి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసిపోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతక్యతను క్యాష్ చేసుకోవాలని బిజెపి ఊస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో నేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం దేశంలో ఏర్పడింది. ఎందుకంటే పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా..వారిలో నిజాయితీ కానరావడం లేదు. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ధి కోసం తప్ప మరోటి కాదు. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలన కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

# కుట్రదారులను పట్టుకోవాల్సిందే !

**న్యూఢిల్లీ :** 2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్భంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు- అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
గురువారం 15-5-2025



# నా అభిమానులు.. ఇంటికి ఆహ్వానిస్తున్నారు...



అమ్మానాన్న ఒప్పుకోకపోయినా నటనపై ఉన్న అభిమానంతో బుల్లితెరకు పరిచయమైన నటి తన్వియా. కన్నడ, తెలుగు సీరియల్స్‌లో లీడ్ రోల్స్‌తో అలరిస్తున్న తన్వియా సినిమాల్లోనూ నటించింది. చిన్నప్పటి నుంచే డ్యాన్స్ మీదున్న ఇష్టంతో స్టేజ్ షోలు చేసిన తన్వియా సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా కెరీర్ ప్రారంభించింది. సీరియల్స్‌లో నటించే అవకాశం రావడంతో నటిగా మారిన ఈ కన్నడ బ్యూటీ అటు కన్నడ పరిశ్రమలోనూ ఇటు తెలుగులోనూ వరుస అవకాశాలతో రాణిస్తున్నది. జీ తెలుగులో ప్రసారమవుతున్న 'ఎన్నాళ్లో వేచిన హృదయం' సీరియల్‌లో త్రిపురగా బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్న తన్వియా జిందగీతో పంచుకున్న ముచ్చట్లు ఆమె మాటల్లోనే.. మాది కర్ణాటకలోని మండ్య. మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం. అక్కలిద్దరి పెళ్లిళ్లయ్యాయి. పెద్దక్కకు నా చిన్నప్పుడే పెళ్లవడంతో తనతో నాకు అనుబంధం తక్కువ. చిన్నక్క, నేను టామ్ అండ్ జెర్రీల్లా కొట్టుకునేవాళ్లం. మంచి స్నేహితులం కూడా. నిజానికి నా పేరు తన్వియా కాదు. చిన్నప్పుడు లత అని పెట్టారు.

కానీ, స్కూల్లో ఉన్నప్పుడు నా పేరు మార్చుకోవాలనిపించింది. నా స్నేహితురాలు తనకు ఇష్టమని తన్వియా అని నాకు పేరు పెట్టింది. మాది మధ్యతరగతి కుటుంబం. బాల్యం అంత సజావుగా ఏం సాగలేదు. కుటుంబ, ఆర్థిక సమస్యలతో అమ్మానాన్న ఎప్పుడూ గొడవపడుతూ ఉండేవాళ్లు. చదువులో ర్యాంక్ స్టూడెంట్‌ని కాదు కానీ ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్‌నే. చదువుకంటే కూడా డ్యాన్స్ అంటే ఎక్కువ ఆసక్తి ఉండేది. అందుకే స్కూల్‌లో, కాలేజీలో నిర్వహించే ప్రతి ప్రోగ్రామ్‌లో తప్పకుండా ప్రదర్శన ఇచ్చేదాన్ని. ఆ ఇష్టమే డ్యాన్స్‌ను కెరీర్‌గా మార్చుకునేలా చేసింది. మా నాన్నకు నేను డ్యాన్స్ చేయడం ఇష్టం ఉండేది కాదు. ఆడపిల్లకు చదువు, ఉద్యోగమే ముఖ్యమని భావించేవారు. అందుకే సినిమాల్లోకి వస్తానంటే ఒప్పుకోలేదు. కానీ, నాన్న మాట కాదని బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా ఒక టీమ్‌లో జాయినయ్యా.

### దాదాపు వెయ్యికి పైగా స్టేజ్ షో

స్ ఇచ్చాను. సినిమాల్లోనూ డ్యాన్సర్‌గా చేశాను. అప్పుడే కలర్స్ కన్నడలో సీరియల్‌లో నటించే అవకాశం వచ్చింది. అప్పటికే చాలా సినిమాలకు, సీరియల్స్‌కు ఆడిషన్స్ ఇచ్చాను. కానీ, ఎవ్వరూ అవకాశం ఇవ్వకపోవడంతో నమ్మకం కోల్పోయా. నాలుగైదు లుక్ టెస్ట్‌ల తర్వాత 2022లో 'అంతర్పట' అనే కన్నడ సీరియల్లో మొదటి అవకాశం వచ్చింది. అందులో నటించే సమయంలోనే తెలుగు, తమిళ పరిశ్రమల నుంచి కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ, అది పూర్తయిన తర్వాతే ఒప్పుకొందామనుకున్నా. ఆ సీరియల్ పూర్తయిన కొద్దిరోజుల్లోనే జీ తెలుగు నుంచి 'ఎన్నాళ్లో వేచిన హృదయం' సీరియల్‌లో అవకాశం వచ్చింది. కథ వినగానే నచ్చడంతో వెంటనే ఒప్పుకొన్నా. మొదట్లో తెలుగు రాకపోవడంతో చాలా ఇబ్బందిపడేదాన్ని. కానీ టీమ్ సపోర్ట్‌తో త్వరగానే నేర్చుకోగలిగా. స్పష్టంగా మాట్లాడలేకపోయినా తెలుగు అర్థం చేసుకోగలను.

హీరోయిన్ రష్మికా మందన్నా అంటే చాలా ఇష్టం. పుష్ప సినిమాలో ఆమె చేసిన పాత్ర చాలా నచ్చింది. గ్లామర్ కంటే నటనకు ఆస్కారం ఉండే పాత్రల్లో నటించాలనుకుంటున్నా. డ్యాన్సర్‌గానూ రాణించాలనుకుంటున్నా. నాన్న మాట కాదన్నప్పటికీ నాకు నచ్చిన పనిని కెరీర్‌గా ఎంచుకుని విజయవంతంగా రాణిస్తున్నాననే సంతృప్తి ఉంది. అమ్మానాన్నలకు ఎప్పుడూ రుణపడి ఉంటా. స్నేహితులు, బంధువులు అందరూ చాలా ప్రోత్సహిస్తున్నారు. నా బెస్ట్ ఫ్రెండ్ వినోద్. చాలా సపోర్ట్ చేస్తాడు. అభిమానులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఈ రోజు నటిగా సంతోషంగా ఉన్నాను. చాలామంది కొన్ని సందర్భాల్లో నా దగ్గరకి వచ్చి నేను చేసిన పాత్రల గురించి చెబుతూ ఏడుస్తూ ఉంటారు. నేను చాలా ఎమోషనల్ అవుతా. అంతగా ప్రేమించే అభిమానులు ఉండటం నిజంగా నా అదృష్టం. ఇంటికి రమ్మని కూడా ఆహ్వానిస్తారు. అలాంటి సందర్భాల్లో చాలా సంతోషంగా ఉంటుంది.

### ప్రపంచం చుట్టేయాలని ఉంది

చిన్నప్పుడు చాలా చలాకీగా ఉండేదాన్ని, కానీ పెరుగుతున్న కొద్దీ ఇంట్లో పరిస్థితుల కారణంగా ఇంట్రావర్ట్‌గా మారిపోయా. ఇప్పుడు మళ్లీ అందరితో కలవడానికి నన్ను నేను మోటివేట్ చేసుకుంటున్నా. ఒంటరిగా ప్రయాణం చేయడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడటం, ఆదర్శవంతమైన వ్యక్తుల జీవితకథల్ని వినడం ఇష్టం.

కర్ణాటకలో దాదాపు అన్ని పర్యాటక ప్రాంతాలను చూశాను. థాయ్‌లాండ్ కూడా వెళ్లాను. ప్రకృతి అంటే చాలా ఇష్టం. పచ్చని పరిసరాల్లో గడపడం, ట్రెక్కింగ్ అంటే ఆసక్తి. భవిష్యత్తులో అమెరికా, పారిస్‌తోపాటు ప్రపంచమంతా చుట్టేయాలని ఉంది.

# ట్రెండింగ్‌లో బాయ్ కాట్ టర్కీ..

### ఆ దేశం కోసం మన డబ్బులు ఖర్చు పెట్టొద్దన్న నిఖిల్



జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడడం మనం చూశాం. 9 ప్రాంతాల్లోని టెర్రర్ క్యాంప్‌పై మెరుపుదాడులకు దిగిన ఇండియన్ ఆర్మీ వాటిని పూర్తిగా నేలమట్టం చేసింది. దీనికి ప్రతిగా పాకిస్తాన్ సైతం భారత్‌లోని ఎయిర్‌బేస్‌లు, మిలటరీ స్థావరాలపై డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేసే ప్రయత్నం చేసింది. అయితే మన సైన్యం వాటిని గాల్లోనే పేల్చేసింది. ఈ పరిణామాలతో భారత్ – పాకిస్తాన్ మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరుగుతుందేమోనని అంతా భయపడ్డారు. కాని ప్రస్తుతానికి బ్రేక్ పడింది.

అయితే భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో టర్కీ(తుర్కియో) పాక్‌కు మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాయ్ కాట్ టర్కీ అనే క్యాంపెయిన్ కూడా రన్ అవుతోంది కొంతమంది పండ్ల వ్యాపారులు టర్కీ యాపిల్స్‌ను దిగుమతి చేసుకోవడం మానేశారు. మరోవైపు టర్కీలో భారతీయ సినీ నిర్మాతలు షూటింగ్స్ పెట్టుకోవద్దని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ అన్ని భారతీయ చిత్ర నిర్మాతలను కోరింది. దీంతో సినిమా షూటింగ్స్ అక్కడ జరగని పక్షంలో ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. ఇక పలువురు ప్రముఖులు కూడా టర్కీపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హీరో నిఖిల్ కూడా తీవ్రంగా స్పందించాడు. ఓ నెటిజన్ సోషల్ మీడియాలో టర్కీ దేశ అధ్యక్షుడి వీడియోను పోస్ట్ చేయగా, అందులో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మాట్లాడుతూ.. ఏదేమైనా మేం పాకిస్థాన్ నే సపోర్ట్ చేస్తాం. ఆ దేశంతోనే కలిసి ముందుకు వెళ్తాం అంటూ ప్రకటించాడు. ఆ నెటిజన్ పోస్ట్ ను రీ ట్వీట్ చేసిన నిఖిల్.. 'ఇప్పుడు చెప్పండి ఆ టర్కీ దేశం వెళ్తారా. మన వాళ్లు చాలా మంది ఆ దేశం వెళ్లి అక్కడ భారీగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు. అలాంటి దేశం కోసం మనం డబ్బులు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ఆ దేశం వస్తువులు కూడా మనం వాడొద్దు' అంటూ రాసుకొచ్చాడు నిఖిల్. ప్రస్తుతం నిఖిల్ ట్వీట్‌ని కూడా కొందరు వైరల్ చేస్తున్నారు.



## మెగాస్టార్‌పై జాలి చూపించిన

# నయనతార..

లేడి సూపర్ స్టార్ నయనతార గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడికి తెలుగులోను, కోలీవుడ్‌లోను మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. హీరోలకి ధీటుగా పారితోషికం అందుకుంటుంది నయనతారు. మరోవైపు సినిమా ప్రమోషన్స్‌లో పెద్దగా పాల్గొనదు. ఈ మధ్య నయనతార సీనియర్ హీరోల సరసన నటిస్తుంది. పారితోషికం విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ కాని నయనతార ఇప్పుడు చిరంజీవి కోసం ఓ మెట్టు దిగిందని అంటున్నారు. త్వరలో మెగాస్టార్ చిరంజీవి.. అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం వంటి భారీ కమర్షియల్ సక్సెస్ తర్వాత అనీల్ రావిపూడి చేస్తున్న చిత్రమిది. ఈ చిత్రంలో కథానాయికగా లేడి సూపర్ స్టార్ నయనతారని ఎంపిక చేశారు. అయితే సినిమాకు సంతకం చేసేటప్పుడు కొన్ని కండిషన్స్ పెట్టే అలవాటు నయనతారకు ఉంది. అందులో ముఖ్యమైనది పబ్లిసిటీ ప్రోగ్రామ్స్, ఇంటర్వ్యూలు వంటివి తనకు కుదరవని చెబుతుంది. కాని చిరంజీవి సినిమా కోసం ఓ మెట్టు దిగి ప్రమోషన్‌లో పాల్గొననుందని అంటున్నారు. ఇటీవల చెన్నై వెళ్లిన అనిల్ రావిపూడి%ొ% నయన్ మీద స్పెషల్ వీడియో షూట్ చేసి వచ్చారు. దీనిని బట్టి ఆమె సినిమా ప్రచార కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. ఇక మరో విషయం ఏంటంటే చిరంజీవి –అనిల్ రావిపూడి సినిమా కోసం నయనతార 18 కోట్ల రూపాయల రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందని ఆ మధ్య ప్రచారం జరిగింది. సౌత్ సినిమా ఇండస్ట్రీలో 10 కోట్లకు పైగా రెమ్యూనరేషన్ తీసుకున్న హీరోయిన్‌గా నయన్ రికార్డ్ క్రియేట్ చేశారు. అయితే ఇప్పుడు చిరంజీవి సినిమా కోసం నయనతార కేవలం 6 కోట్ల రూపాయలు తీసుకోవడానికి సిద్ధమైందట. చిరు సినిమా కోసం ఆవిడ స్పెషల్ ఇంట్రెస్ట్ చూపించడం చూసి అందరు ఆశ్చర్యపోతున్నారు. ఇక నయనతార నటించిన చివరి తెలుగు సినిమా గాడ్ ఫాదర్ కాగా, అందులో ఆవిడ సిస్టర్ రోల్ చేశారు. అంతకు ముందు హిస్టారికల్ వార్ డ్రామా 'సైరా నరసింహారెడ్డి' సినిమాలో హీరోయిన్ రోల్ చేశారు.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656